ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టిశ్రీరాములు **నెల్లూరు** జిల్లా వార్తలు

శుక్రవారం 5 ఏప్రిల్ 2024





రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : 6.23

సహరి (శనివారం) : 4.42

ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.6	26.5
కావలి	38.0	26.0
కందుకూరు	37.0	27.0
ఆత్మకూరు	41.0	26.0
ఉదయగిరి	42.0	25.0

పంచాయతీల్లో మళ్లీ పైసల చోరీ

- నిన్న ఆర్థిక సంఘం నిధులు.. నేడు స్టాంప్ డ్యూటీ డబ్బులు
- పంచాయతీల నగదు వాడేసుకున్న ప్రభుత్వం
- ఏడాది నుంచి రిజిస్ట్రేషన్ శాఖ నుంచి జమకాని షేర్
- కనీస వసతులకూ నిధుల్లేక పంచాయతీలు విలవిల

నెల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పల్లె పాలనను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. కనీసం మౌలిక వసతులకు కూడా నిధుల్లేకుండా పంచాయతీల నిధులన్నింటినీ వైసీపీ ప్రభుత్వం లాగేసుకుంటోంది. గ్రామ పాలనను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేస్తున్న ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం రకరకాల పేర్లతో బదలాయిస్తోంది. నిన్నటి వరకూ విద్యుత్ బకాయిల పేరుతో లాగేసుకోగా ఇప్పుడు రిజిస్ట్రేషన్ చార్జీల ద్వారా ఆదాయంలో పంచాయతీలకు రావాల్సిన షేర్‌ను కూడా ఏడాది నుంచి జమ చేయడం లేదు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆయా పంచాయతీలో జరిగిన రిజిస్ట్రేషన్లు, వచ్చిన ఆదాయం ఆధారంగా పంచాయతీలకు భాగం ఇవ్వాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా పంచాయతీల ఖాతాల్లో జమకాలేదు. ఎందుకు జమ చేయడం లేదంటే సమాధానం చెప్పేవారు లేకుండా పోయారు.

● పంచాయతీలకు 40 శాతం


ఒక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూమి లేదా భవనాలు రిజిస్ట్రేషన్ జరిగితే అందుకు వసూలయ్యే స్టాంప్ డ్యూటీలో 40 శాతాన్ని స్థానిక పంచాయతీకు ఇవ్వాల్సి ఉంది. అలానే 20 శాతాన్ని మండల పరిషత్‌లకు, మరో 20 శాతాన్ని జిల్లా పరిషత్‌కు జమ చేయాలి. స్టాంప్ డ్యూటీ రూపంలోనే జిల్లాలోని పంచాయతీలకు రూ.కోట్లలో నిధులు జమ కావాల్సి ఉంది. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఈ నిధులు పంచాయతీలకు ఊపిరిపోస్తాయి. పంచాయతీలకే కాకుండా మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు కూడా ఈ నిధులు ఆసరాగా నిలుస్తాయి. కానీ సదరు శాఖలో పట్టించుకునే అధికారే కనిపించడం లేదు.

● వచ్చింది వచ్చినట్టు లాగేసుకుని..

చాలా పంచాయతీల్లో ఆర్థిక సంఘం నిధులు గానీ జనరల్ ఫండ్ నిధులు గానీ లేవు. గతేడాది ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బకాయిల పేరుతో లాగేసుకుంది. ఈ ఏడాది జనవరిలో విడుదలైన మరో విడత ఆర్థిక సంఘం నిధులను మూడేళ్లుగా పంచాయతీల్లో చేసిన వర్కులకు బిల్లులు చెల్లించారు. గతేడాది వరకు వసూలు చేసిన ఇంటి పన్నులు జనరల్ ఫండ్‌లో ఉండగా వాటిని కార్మికుల వేతనాలు, ఇతరత్రా ఖర్చులకు వినియోగించారు. ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడంతో ఇంటి పన్నులు వసూలు చేయవద్దని రాజకీయ నాయకులు పంచాయతీ సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో పంచాయతీలకు ఎటువంటి ఆర్థిక మార్గం లేకుండా పోయింది.

● వేసవిలో పెరగనున్న ఖర్చులు

వేసవి కావడంతో గ్రామాల్లో నీటి అవసరాలు పెరుగుతున్నాయి. ఎక్కువ సమయం మోటార్లు ఆడాల్సి ఉంటుంది కాబట్టి అవి తరచూ మరమ్మతులకు గురవుతూ ఉంటాయి. అలానే ట్యాంకులను శుభ్రం చేసుకోవడం, పైపులైన్లకు మరమ్మతులు చేసుకోవడం వంటి పనులు రెగ్యులర్‌గా చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే సర్పంచ్‌లు తమ సొంత నిధులతో చాలా పనులు చేసి ఉన్నారు. వాటికే బిల్లులు తెచ్చుకోలేక నానా తంటాలు పడుతున్నారు. పోనీ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్టాంప్ డ్యూటీ వాటా అయినా వస్తే ఎలాగోలా నెట్టుకొద్దామనుకుంటే ఆ నిధులు కూడా ఇవ్వకుండా పంచాయతీలతో ఆటలాడుకుంటున్నారని స్థానిక సంస్థల ఉద్యోగులు వాపోతున్నారు. ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి సుస్మితా రెడ్డి మాట్లాడుతూ పంచాయతీలకు నిధులు జమకాని మాట వాస్తవమేనని అన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నట్లు చెప్పారు.



'ఒకచాన్స్.. ఒక్కచాన్స్... ఇవ్వండి.' అంటూ వైసీపీ అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జిల్లాలో పాదయాత్ర చేశారు. తిరిగిన ప్రతిచోటా హామీలు గుప్పించారు. గెలిపిస్తే అద్భుతం జరుగుతుందనే నమ్మకం కలిగించారు. తీరా గెలిచాక మాట తప్పి, మడమ తిప్పేశారు. ముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు వచ్చిన ప్రతిసారీ హామీల వర్షం కురిపించారు. అభివృద్ధి కోసం రూ.కోట్లు కేటాయిస్తున్నట్లు నమ్మబలికారు. పాలనా కాలం ముగిసిపోతున్నా అభివృద్ధి దేవుడెరుగు.. పైసా కూడా విదల్చలేదు. గాల్లో ఎగిరొచ్చి వెళ్లిపోవడం తప్ప ఈ ఐదేళ్లలో ఒక్కసారి కూడా జనంలోకి రాని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి శుక్ర, శనివారాల్లో బులెట్ ప్రూఫ్ బస్సులో వస్తున్నారు. 'మళ్లీ నాకే ఓటేయండి.' అని అడగబోతున్నారు. జనం చెవిలో అబద్ధాల పూలు మరోసారి పెట్టబోతున్నారు. జనం మాత్రం తక్కువ తిన్నారా... దబాయింపు, దౌర్జన్యం పాలనగా సాగిన కాలంలో మౌనంగా ఉండిపోయారుగానీ ఎన్నికల వేళ జగన్‌రెడ్డి పాత హామీలను గుర్తు చేసుకుంటున్నారు. ఒక్కటీ అమలు చేయకుండా మరో చాన్సివ్వండి అక్కచెల్లెమ్మలూ అని మాయ చేయడానికి వస్తున్నాడని అంటున్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఇచ్చిన మాట మరిచారా!?

- ఒక్క హామీ నెరవేర్చని సీఎం జగన్!
- నేడు, రేపు జిల్లాలో పర్యటన



గట్టెక్కని కష్టాలు

2021లో సంభవించిన వరదల సందర్భంగా నెల్లూరు పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి నగరంలో నీట మునిగిన ప్రాంతాలను సందర్శించారు. యుద్ధప్రాతిపదికన పెన్నా పొర్లుకట్టల నిర్మాణానికి రూ. 100 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించారు. ఇప్పటికి మూడేళ్లు గడిచిపోయినా అతీగతీ లేదు. పెన్నా పొర్లుకట్టల నిర్మాణం పునాది దశను దాటలేదు. ఇప్పటివరకు కేవలం 10 శాతం పనులు మాత్రమే జరిగాయి.

● నెల్లూరు నగరంలో 1600 కోట్ల రూపాయలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజ్, తాగునీటి ప్రాజెక్టులు టీడీపీ హయాంలోనే 90 శాతం పూర్తి అయ్యాయి. మిగిలిన పది శాతం పనులను కూడా ఈ ఐదేళ్ల కాలంలో వైసీపీ పాలకులు పూర్తి చేయలేకపోయారు. టిడ్కో ఇళ్లను పేదలకు పంచడానికి ఐదేళ్ల కాలం మనసు రాలేదు. ఇప్పటికి 50శాతం మంది లబ్ధిదారులకు ఇళ్లను స్వాధీనం చేయలేదు. నెల్లూరు నగర అభివృద్ధి కోసం అంటూ ప్రత్యేకంగా నిధులూ విడుదల చేయలేదు.



కావలికి ఇస్తానన్న 80 కోట్లు ఏవీ!?

గత ఏడాది కావలి పర్యటన సందర్భంగా ట్రంకు రోడ్డును వెడల్పు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. కావలి పెద్ద చెరువును రిజర్వాయర్‌గా చేసి రూరల్ మండలంలోని చెరువులకు సాగు, తాగునీరు అందిస్తామన్నారు. వెంగళరావు నగర్, ఇందిరమ్మ కాలనీ రోడ్లు, డ్రైన్లు రూ.80 కోట్లు ఇస్తామన్నారు. వీటిలో ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు.



వంతెన ఏది సారూ!

నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో పొట్టేపాళెం వద్ద వంతెన నిర్మాణానికి సీఎం జగన్ హామీ ఇచ్చారు. కేవలం పది కోట్లతో పూర్తయ్యే ఈ నిర్మాణాన్ని ఉద్దేశపూర్వకంగానే పెండింగ్ పెట్టారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. జొన్నవాడ కూడలి వద్ద దేవరపాళెం రోడ్డుపై కొట్టుకుపోయిన కల్వర్ట్‌ను పరిశీలించి అక్కడ బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జొన్నవాడ నుంచి తాడిపత్రి వరకు రోడ్డు ఆధునీకరణ, ములుమూడి కలుజులపై వంతెన నిర్మాణాలకు హామీ ఇచ్చారు.

'రాళ్లపాడు'ను మరిచారా!?

జగన్ పాదయాత్ర సందర్భంగా కలిగిరి, సోమశిల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరు నింపి సాగు,తాగు కష్టాలు తీరుస్తామని జగన్ ప్రకటించారు. అలాగే కలిగిరి జిర్రావారిపాళెం కాటన్ యార్డును కోల్డు స్టోరేజ్‌గా మార్చి వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు అవకాశం కల్పిస్తామన్నారు. రాళ్లపాడు ప్రాజెక్టు నీటి సామర్థ్యం పెంచుతానన్నారు. కానీ వీటిలో ఒక్కటీ నెరవేర్చలేకపోయారు.





'కోవూరు షుగర్స్' గతేంటి!?

తాను అధికారంలోకి రాగానే కోవూరు షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానన్న జగన్ ఐదేళ్లు గడిచినా ఇప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. అయితే, ఫ్యాక్టరీ విక్రయానికి పెట్టడంతో రైతులు తిరగబడ టంతో ఆ ప్రతిపాదనను విరమించుకున్నారు. ఆర్టీసీ బస్టాండు నెలకొల్పాలన్న ప్రతిపాదనపైనా వ్యతిరేకత వచ్చింది.

● జిల్లాకు చేరుకున్న సీఎం జగన్

ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర గురువారం రాత్రి జిల్లాకు చేరుకుంది. సాయంత్రం తిరుపతి జిల్లా నాయుడుపేటలో సభ అనంతరం గూడూరు మీదుగా మనుబోలు వద్ద జిల్లాలోకి యాత్ర ప్రవేశించింది. రాత్రి నెల్లూరుకు చేరుకోగా నగర శివారులో జగన్ బస చేశారు. శుక్రవారం యాత్రకు విరామం ప్రకటించారు. శనివారం ఉదయం సిద్ధం బస్సు యాత్ర తిరిగి ప్రారంభమవుతుంది.

● పరిశ్రమల మాటేమిటి!?

సోమశిల జలాశయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని, ఉత్తర కాలువ ఆధునీకరణ, హైలెవల్ కెనాల్ నిర్మాణం పూర్తి చేస్తామని పాదయాత్ర సందర్భంగా జగన్ హామీలు గుప్పించారు. అంతేకాదు.. ఆత్మకూరులో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. పారిశ్రామికవాడ ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడికి వచ్చిన భారీ పరిశ్రమ సెంచురీ ప్లేఉడ్ బద్వేలుకు తరలించుకుపోయారు.

జిల్లా ఎస్పీగా ఆరీఫ్ హఫీజ్



ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 4 : జిల్లా ఎస్పీగా కె ఆరీఫ్ హఫీజ్ గురువారం రాత్రి నెల్లూరులోని పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడున్న డాక్టర్ కె తిరుమలేశ్వర రెడ్డిని ఎన్నికల కమిషన్ విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ఎస్పీగా బెంగుళూరుకు చెందిన ఆరీఫ్ హఫీజ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులు, అధికారుల వివరాల గురించి ఏఎస్పీలను అడిగి ఎస్పీ తెలుసుకున్నారు. 2015 బ్యాచ్‌కు చెందిన ఆరీఫ్ హఫీజ్ తొలిపోస్టింగ్ నర్సీపట్నం ఎస్పీగా 2017 డిసెంబరు నుంచి 2019 జూలై వరకు పని చేశారు. ఆ తర్వాత గుంటూరు రూరల్, అర్బన్ జిల్లాల సెబ్ ఏఎస్పీగా పనిచేశారు. 2021లో గుంటూరు అర్బన్ ఏఎస్పీగా, జిల్లాల పునర్విభజన తర్వాత గుంటూరు జిల్లా ఎస్పీగా ఈ ఏడాది జనవరి వరకు పనిచేశారు. జనవరిలో జరిగిన ఎస్పీల బదిలీల్లో ఇంటెలిజెన్స్ విభాగానికి ఆయన బదిలీ అయ్యారు.

ఇది కనిపించలేదా...!



ఈ చిత్రం మనుబోలు మండలంలోని వెంకన్నపాళెం పాత సచివాలయం. సచివాలయాల కొత్త నిర్మాణాలు జరగక ముందు ఇందులోనే సచివాలయం, ఆర్బీకే నిర్వహించారు. ఆ సమయంలో వైసీపీ రంగులు అద్దారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ ఉన్నా ఎన్నికల నియమావళిని అమలు చేయాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైసీపీ రంగులు తొలగించాలని ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారు.

- మనుబోలు



ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో ఆనం

ఆత్మకూరును మరింత అభివృద్ధి చేస్తాం

- ఆత్మీయ సమావేశంలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 4 : ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా ఉన్న తమను ఆశీర్వదించి గెలిపిస్తే ఆత్మకూరును మరింత అభి వృద్ధి చేసి చూపుతామని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరులోని రవితేజ కల్యాణ మండ పంలో జరిగిన ఉమ్మడి కూటమి ఆత్మీయ సదస్సులో ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఆయన పాల్గొని ప్రసం గించారు. ఆత్మకూరు అభివృద్ధే లక్ష్యంగా ఆనం గతంలో రూ.105కోట్ల తో సోమశిల నుంచి తాగునీటిని తెచ్చారని గుర్తుచేశారు. రూ.1600 కోట్లతో సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణానికి సాధించడంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత ఆనంకే దక్కుతుందన్నారు. ఆనం రామనారాయణ మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి వైసీపీ పాలనలో కుంటుపడిందని అన్నారు. పదేళ్ల కిందట తాను ఆత్మకూరును విద్య, వైద్య రంగాల్లో ముందుకు తీసుకెళ్లానని గుర్తుచేశారు. ఆత్మకూరును పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంతో పాటు అన్ని రంగాల్లో ఆత్మకూరును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పోలింగ్ నిర్వహణకు 14వేల మంది

- ర్యాండమైజేషన్ కార్యక్రమంలో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం); ఏప్రిల్ 4 : జిల్లాలో పోలింగ్ నిర్వహణకు 14,945 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించామని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో ఎన్నికలకు పోలింగ్ అధికారులను కేటాయించడానికి మొదటి విడత ర్యాండమైజేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2900 మంది పోలింగ్ అధికారులు, 2914 మంది అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, 9131 మంది ఇతర అధికారులని తెలిపారు. వారిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామని చెప్పారు. కాగా, జిల్లాలో 2,470 పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో లవన్న, సీపీఓ ఎస్.రాజు, డీఈఓ పి.రామారావు, జిల్లా ఇన్ఫర్మేషన్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయాధికారుల బదిలీలు

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 4 : రాష్ట్రవ్యాప్తంగా అదనపు జిల్లా న్యాయాధికారులను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు నగరం ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయాధికారి సి.సత్యవాణి అనంతపురం జిల్లా 1వ అదనపు న్యాయాధికారిగా బదిలీ అయ్యారు. నగరంలో కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రత్యేక మహిళా కోర్టు, 8వ అదనపు జిల్లా న్యాయాధికారిగా కడప 1వ అదనపు జిల్లా న్యాయాధికారిగా పని చేస్తున్న టిగీతను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు జిల్లా కేంద్రానికి ఉత్తర్వులు అందాయి. అలాగే, నెల్లూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి డాక్టర్ బి. లక్ష్మీనారాయణను కృష్ణా జిల్లా గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో చిత్తూరు లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా పని చేస్తున్న ఐ. కరుణకుమార్‌ను నియమించారు.



వలేటివారిపాలెంలో ఎండుతున్న నిమ్మతోట

ఎండుతున్న నిమ్మ.. రైతు కంట కన్నీటి చెమ్మ!

వలేటివారిపాలెం మండలంలో ఏడెనిమిదేళ్లుగా అరకొరగానే వర్షపాతం నమోదవుతోంది. దీంతో వాగులు, వంకలు, కుంటలు చెరువులలో చుక్కనీరు లేకుండా పోయింది. చెరువుల కింద ఉన్న మాగాణి భూములు బీళ్లుగా మారాయి. భూగర్భజలాలు అడుగంటి బోర్లు, బావులు ఒట్టిపోయాయి. వీటికింద నీటి లభ్యతను నమ్ముకొని సాగు చేసిన నిమ్మ, బత్తాయి, సపోట, మామిడి తదితర పండ్ల తోటలు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని చుండి, అయ్యవారిపల్లె పోలినేనిచెరువు, గరుకుపాలెం, అంకభూపాలపురం, రామంద్రాపురం, లింగపాలెం, వలేటివారిపాలెం, బంగారక్కపాలెం, అమ్మపాలెం, పోలినేనిపాలెం, జమీన్‌ఉప్పలపాడు, కొండసముద్రం, కూనిపాలెం, పోకూరు. బడేవారిపాలెం శింగమనేనిపల్లె తదితర గ్రామాలలో సుమారు బత్తాయి, నిమ్మ, మామిడి, సపోట, జామ తదితర పండ్ల తోటలు ఉన్నాయి. ప్రస్తుతం మామిడి, నిమ్మ పంటలు కాయ దశలో ఉన్నాయి. ఆ పండ్ల తోటలకు నీటి లభ్యత చాలా అవసరం. బోర్లు అడుగుంటడంతో పంటలకు నీటి తడులు అందడం ఇబ్బందిగా మారింది. నీటి తడులు అందక చాలా గ్రామాల్లో పండ్ల తోటలు ఎండుముఖం పడుతున్నాయి. వాటిని కాపాడుకోవాలన్న ఉద్దేశంతో రైతులు రూ.లక్షలు వెచ్చించి 300 అడుగుల లోతున బోర్లు వేస్తున్నారు. అయినా నీరు అందడం లేదు. కళ్లెదుటే ఎండిపోతున్న పండ్ల తోటలను చూసి రైతులు విలవిల్లాడిపోతున్నారు.

- వలేటివారిపాలెం

కార్పొరేషన్‌లో పర్సంటేజీల పందేరం

ఇంజనీరింగ్‌లో లంచం సొమ్ముకు కోడింగ్


రూ.లక్షకు రూపాయి!

ఏం రాజయ్య (పేరు మార్పు) మీ సీసీరోడ్డు పూర్తయినట్టుంది. బిల్లు నా దగ్గరకి వచ్చింది. సీఎఫ్ఎంఎస్‌కు పంపాను. నేడో, రేపో నీ ఖాతాలో జమైపోతుందులే. మిగిలిన వారివి కూడా వారి ఖాతాల్లో పడిపోయాయి. నీ బిల్లు రూ.50 లక్షలు కదా. నేను మనిషిని పంపిస్తా.. రెండు రూపాయలు (రూ.2 లక్షలు) పంపు.

- కాంట్రాక్టర్‌తో ఓ ఇంజనీరు

కొత్త కోడింగ్ విధానంలో లంచం డిమాండ్

నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో ఇదీ సంగతి. సార్వత్రిక ఎన్నికల హడావుడి మొదలైన నాటినుంచి నెల్లూరులోని పనులు చేసిన కాంట్రాక్టర్లకు వేగంగా బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. ఇందుకు తామే కారణమంటూ ఇంజనీరింగ్ విభాగంలోని కొందరు అధికారులు పర్సంటేజీల వసూళ్లకు పదును పెట్టారు. రూ.లక్షకు రూపాయి కోడింగ్ విధానం అమలు చేస్తున్న మరికొందరు అధికారులు రూ.వేలకు పైసలు చొప్పున లంచం సొమ్మును దండుకుంటున్నారు. నగర పరిధిలో సీసీరోడ్లు కల్వర్టులు, ప్యాచ్ వర్కులు కాంట్రాక్టర్లకు పంచి పెట్టిన వైసీపీ నేతలు వారి పర్సెంటేజీలు ముందుగానే తీసేసుకోవడంతో పనులు పూర్తి చేసిన వారికి కార్పొరేషన్ ఖజానాలోని సొమ్ములతోపాటు ప్రభుత్వం ప్రత్యేక నిధిని కూడా సమకూర్చింది. తామే దగ్గరుండి బిల్లులు చేయిస్తున్నామంటూ ఇంజనీరింగ్ అధికారులు క్రెడిట్‌ను నెత్తినేసుకుని అందులో పర్సంటేజీలు దండేస్తున్నారు.



● రూ.లక్షకు 17 శాతం వసూళ్లు

నగరంలోని 54 డివిజన్లలో సాధారణ నిధులు రూ.20 కోట్లతోపాటు 15వ ఆర్థిక సంఘం రూ.50 కోట్లు, జీజీఎంపీ నిధులు సుమారు రూ.99.60 కోట్లు, ఎంపీ నిధులు రూ.10 కోట్లతో రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, రోడ్డు ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. వీటిల్లో ముప్పాతిక శాతం వరకు పూర్తయ్యాయి. అందులో సగం వరకు బిల్లులు మంజూరు కాగ పాతిక శాతం బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ అయ్యాయి. సాధారణంగా ఇంజనీరింగ్ విభాగంలో రూ.లక్షకు 12 - 15 శాతం వరకు పర్సంటేజీ డిమాండ్ చేసి వసూళ్లు చేస్తున్న అధికారులు తాజాగా ఆ లెక్కను 17 శాతానికి పెంచారు. క్షేత్రస్థాయిలోని వర్కు ఇన్‌స్పెక్టర్ నుంచి ఇంజనీరింగ్‌లోని ఉన్నత స్థాయి అధికారి వరకు ఈ పర్సంటేజీని వసూళ్లు చేస్తున్నారు. కాంట్రాక్టర్ వద్ద ఏఈఈలు వసూళ్లు చేసి అన్ని కేటగిరీలకు పంచిపెడుతున్నట్లు సమాచారం.

● నాణ్యత పట్టింపేది!?

కార్పొరేషన్ పరిధిలోని నిర్మాణ పనులకు బిల్లుల చెల్లింపు వ్యవహారం సందట్లో సడేమియా అన్నట్టుంది. సార్వత్రిక ఎన్నికల పోరులో రాజకీయ పార్టీలు మునిగి తేలడంతో వారి జోలికి ఎవరు రారన్నట్టుగా యవ్వారం నడుస్తోంది. ఇదే క్రమంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం కూడా తూతూ మంత్రంగా పనులను పరీక్షిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వారికి ప్రత్యేక పర్సంటేజీలు ఉండటంతో నాణ్యతను పెద్దగా గుర్తించే పనిలేకుండా కాంట్రాక్టర్ ఒత్తిడి మేరకు నివేదిక తయారు చేసి ఇచ్చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం జరిగిన, జరుగుతున్న పనులపై కమిషనర్ పూర్తి స్థాయిలో నాణ్యతను పరీక్షిస్తే అనేక లోపాలు బహిర్గతమవుతాయని పలువురు కోరుతున్నారు.

- నెల్లూరు(సిటీ)

ధాన్యం నిల్వకు సౌకర్యాలేవి ?

- మార్కెట్ గోదాము ఉన్నా ప్రయోజనం శూన్యం
- కోతకోసిన వెంటనే అమ్ముకోవాల్సిన దుస్థితి

అనంతసాగరం, ఏప్రిల్ 4: చేతికందిన ధాన్యానికి మరింత గిట్టుబాటు ధర లభించే వరకు నిల్వ చేసుకొనే సౌకర్యం లేకుండా పోయింది. దీంతో కల్లాల్లోనే వ్యాపారులకు తెగనమ్ముకోవాల్సి దుస్థితి ఏర్పడింది. మండలంలోని అన్నీ పంచాయతీల్లో ఈ సీజన్‌లో సుమారు 15 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. అయితే స్థానికంగా మార్కెట్‌యార్డ్ గోదాము ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. గోదాముపై పర్యవేక్షణ కరువై శిథిలావస్థకు చేరింది. దీంతో గోదాము పరిసర ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. గోదాములో ధాన్యం ఆరబెట్టుకునేందుకు మూడు ప్లాట్‌ఫారం ఉన్నాయి. అయితే ప్రధానగేట్లు దెబ్బతిని అధ్వానంగా మారాయి. దీంతో మూగజీవాలు గోదాము ప్రాంగణంలో చేరి ఆరబెట్టుకున్న ధాన్యం తినేస్తున్నాయి. దీంతో పగలు, రాత్రి రైతులు కాపాలాకాస్తూ ఇబ్బందులు పడుతున్నారు. గోదాము ఉన్నప్పటికి వర్షం కురిస్తే భవనం ఉరుస్తుంది. దీంతో ధాన్యం నిల్వకు రైతులు సాహసించడం లేదు. ఈ క్రమంలో ప్రస్తుత వరికోతల సమయంలో వచ్చినకాడికి ధాన్యాన్ని కల్లాల్లోనే అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా గోదాముకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.


కల్లాల్లోనే లారీకి ధాన్యం లోడ్ చేస్తున్న కూలీలు


మరమ్మతులకు గురైన గోదాము గేటు

సాయిపేటలో జామాయిల్ తోట దగ్ధం

కొండాపురం, ఏప్రిల్4: మండలంలోని సాయిపేటలో చెరువు పైభాగాన నిప్పంటుకొని గురువారం సుమారు 18 ఎకరాల జామాయిల్ తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన వంగల్లు సూరిబాబుకు చెందిన 14 ఎకరాలు, సాధినేని సుమతికి చెందిన 4 ఎకరాల జామాయిల్ తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించగా దగ్ధమయినట్లు బాధితులు తెలిపారు. నిప్పంటుకొన్న విషయాన్ని గమనించి కావలి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా వాహనం అక్కడకు వెళ్లేందుకు వీలులేకపోవడంతో మంటలను ఆర్పలేకపోయారు. దీంతో తోటలు పూర్తిగా కాలిపోయి సుమారు రూ.7 లక్షల వరకు నష్టపోయామని బాధితులు తెలిపారు.


దగ్ధమయిన జామాయిల్ తోట

కోడు ఉన్నా... తరలింపు చూడు !

- యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు
- అధికార పార్టీ నేతల బరితెగింపు

కావలి రూరల్, ఏప్రిల్ 4: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా కావలి కొనదిన్నె గిరిజనకాలనీ సమీపం నుంచి యధేచ్ఛగా గ్రావెల్ తరలింపు జరుగుతోంది. గురువారం అధికారపార్టీ నేతల బరితెగింపుతో టిప్పర్లతో గ్రావెల్ తరలిస్తున్నారు. మండలంలోని రుద్రకోట, కావలి పెద్దచెరువుతోపాటు లేఅవుట్లు వేస్తున్న ప్రాంతాలకు దగ్గర లో ఉన్న చెరువుల్లోని మట్టిని సైతం వారు కొల్లగొడుతున్నారు. కొనదిన్నె గిరిజనకాలనీ సమీపంలో అధికారపార్టీ నేతల బరితెగింపుతో లేఅవుట్లకు గ్రావెల్, మట్టి తరలించి డంప్ చేస్తుండడంతోపాటు ఎప్పటికప్పుడు చదును చేస్తున్నారు. అధికారపార్టీ నేతల బరితెగింపుతో ప్రజలు విస్తుపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


కొనదిన్నె గిరిజనకాలనీ సమీపంలో గ్రావెల్‌ను డంప్ చేస్తున్న టిప్పర్

జగన్ ఫొటోలు తొలగేనా..?

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఫోటోలు తొలగించాల్సిందేనని ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పటికీ మండల పరిధిలోని పోతిరెడ్డిపాళెం మజరా చంద్రశేఖరపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయన ఫోటోలు దర్శనమిస్తున్నాయి. అంగన్‌వాడీ సిబ్బందిని జగన్ ఫోటోలు తొలగించమని స్థానికులు కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ విషయమై తాము ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామని స్థానికులు తెలిపారు.

\- కోవూరు


పోతిరెడ్డిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో దర్శనమిస్తున్న జగన్ ఫొటో

వడదెబ్బకు వృద్ధురాలి మృతి

కోవూరు, ఏప్రిల్ 4: వడదెబ్బకు గురై మండల పరిధిలోని వేగూరు మజరా వసంతపురం కాలనీకి చెందిన వృద్ధురాలు తుమ్మా నరసమ్మ (80) గురువారం మృతిచెందింది. వేగూరు పంచాయతీ కార్యాలయానికి వృద్ధాప్య పింఛను తీసుకునేందుకు వెళ్ళిన ఆమె ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై తహసీల్దారు కార్యాలయానికి, పోలీసుస్టేషన్‌కు ఎలాంటి సమాచారం అందలేదు.


మృతి చెందిన తుమ్మా నరసమ్మ (ఫైల్)

గుర్తుతెలియని వృద్ధురాలు..

సంగం, ఏప్రిల్ 4: మక్తాపురం పొలాల్లో 70సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని అనాథ వృద్ధురాలు మృతదేహాన్ని గురువారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	153
లేయర్ లైవ్	82
స్కిన్ చికెన్	268
స్కిన్‌లెస్	294
లేయర్	140

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6639
వెండి కిలో ధర	రూ. 81,900
వెండి ఒక గ్రాము	రూ. 83.90

ఉరేసుకుని మహిళ..

చేజర్ల, ఏప్రిల్ 4: ఆదురుపల్లికి చెందిన రామనవామి(22) అనే మహిళ గురువారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ ప్రభాకర్‌రావు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రావనవామి దంపతులు కొన్ని నెలలుగా ఆదరుపల్లిలో పానీపూరి బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున భార్య ఉరేసుకుని చనిపోయి ఉండడం గమనించిన భర్త పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ పంపిణీలో కోత

- బియ్యం, చక్కెర మినహా అందని ఇతర సరుకులు
- ఇంటి వద్దకే పంపిణీ ఉత్తిదే..!
- ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆపరేటర్ల తొలగింపు

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 4 : జిల్లాలో రేషన్ పంపిణీలో అస్తవ్యస్థ పరిస్థితులు నెలకొన్నాయి. బహిరంగ మార్కెట్‌లో పలసరుకులు, వంట నూనెల ధరలు విపరీతంగా పెరిగి పోయిన నేపథ్యంలో వాటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా రేషన్ పంపిణీలో సరుకులను కుదించేసింది. ఇంటింటికీ రేషన్ పంపిణీ అని సీఎం జగన్ ప్రకటించినా వీధిలో ఎక్కడో ఎండీయూ వాహనాన్ని ఆపి సరుకులు పంపిణీ చేస్తున్నారు. రేషన్ షాపుల ద్వారా పంపిణీ జరుగుతున్నప్పుడు తాము వీలైనప్పుడు ఆ దుకాణాలకు వెళ్లి సరుకులు తెచ్చుకొనే వెసులుబాటు ఉండేదని కార్డుదారులు అంటున్నారు. ప్రస్తుతం ఎండీయూ వాహనం వీధిలోకి ఎప్పుడు వస్తుందో కాచుకుని ఉండి సరుకులు తీసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. వలంటీర్లు ఈ వ్యవస్థలో ఇటీవల వరకు తమదైన పాత్ర పోషించారు. ఎన్నికల నిబంధనలతో తాజాగా వారిని రేషన్ పంపిణీ నుంచి తప్పించారు. ఎండీయూ వాహనాలను సంక్షేమశాఖల వారీగా వాహనదారులకు అందచేశారు. జిల్లాలో 7,33,520 కార్డులుండగా వీరందరికి ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు అందజేయాల్సి ఉంది. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి కొనుగోలు చేసిన ఈ వాహనాలు కేవలం బియ్యం, చక్కెర పంపిణీకేనా అని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు.


రోడ్డుపై నిలిపిన ఎండీయూ వాహనం వద్ద సరకులు తీసుకుంటున్న కార్డుదారులు

కందిపప్పు ఊసే లేదు :

జిల్లాలో కందిపప్పు ధర విపరీతంగా పెరిగింది. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.170 వరకు పలుకుతోంది. టీడీపీ ప్రభుత్వంలో రేషన్ షాపుల ద్వారా కందిపప్పును రూ.40కే అందచేశారు. వైసీపీ హయాం వచ్చాక కిలో ధరను రూ.67కు పెంచారు. అది కూడా సక్రమంగా పంపిణీ చేయడం లేదు. కొంతకాలంగా చౌకదుకాణాల ద్వారా కందిపప్పు పంపిణీని పూర్తిగా ఆపేశారు. అలాగే, టీడీపీ ప్రభుత్వంలో వంటనూనె కూడా రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి కూడా లేదని కార్డుదారులు ఆరోపించారు. అంతేకాక గత ప్రభుత్వంలో కిలో పంచదారను రూ.14 చొప్పున ఇచ్చేవారని, ఇప్పుడు అరకిలోనే ఇస్తూ దానికి కూడా రూ.14 వసూలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. రంజాన్ మాసంలో తోఫా పేరుతో అదనపు సరుకులు ఇచ్చేవారని, ఇప్పుడు వాటిని పట్టించుకోవడం లేదంటున్నారు.

సీఎం బొమ్మపై కాగితం


జిల్లాలో రేషన్ సరకులను పంపిణీ చేయడానికి 438 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలపై రంగులతోపాటు సీఎం జగన్ బొమ్మ ఉంది. ఎన్నికల కోడ్ అమలులోకి రావటం, ప్రతిపక్షాల ఆరోపణలతో ఆ బొమ్మపై కాగితం అంటించారు. వైసీపీ రంగులు మాత్రం అలాగే ఉన్నాయి.

ఇద్దరు ఆపరేటర్ల తొలగింపు

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు ఎండీయూ వాహనాల ఆపరేటర్లను ఆ బాధ్యతల నుంచి తొలగించారు. ఇంటింటికి సరుకులు అందజేసేందుకు ఈ వాహనదారులకు నెలకు రూ.21వేలు ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే కార్డులున్న ప్రతి ఇంటికీ మాత్రం సరుకులు వెళ్లడం లేదు. జన రద్దీ ఉన్న రోడ్ల మీద వాహనాలు ఆపి సరుకులు ఇవ్వటం తమకు ఇబ్బందికరంగా ఉందని కార్డుదారులు వాపోతున్నారు.

నేటి నుంచి సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

సంగం, ఏప్రిల్ 4: పెన్నానది ఒడ్డున వెలసిన సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15వ తేదీ వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరుగనున్నాయి. పద కొండు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో కామాక్షిదేవీ సమేత సంగమేశ్వరస్వామి ప్రతిరోజూ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.


బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన సంగమేశ్వరాలయం

ఉత్సవ కార్యక్రమాలు..

5న ఉదయం అంకురారోహణ, రాత్రి ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 6న రాత్రి శేషవాహన గ్రామోత్సవం, 7న అశ్వవాహనం, 8న సింహవాహనం, 9వ తేదీ ఉదయం వీరభద్రస్వామి హోమం, రాత్రికి పులివాహనసేవ, 10న రావణసేవ, 11న నంది సేవ, 12న ఉదయం రథోత్సవం, రాత్రికి పురషామృగ మహోత్సవం, 13న గిన్నెభిక్ష, రాత్రికి కల్యాణం, 14న మేష సంక్రమణ, పుణ్యకాల తీర్థవాది, సాయంత్రం అలకలతోపు, అనంతరం ధ్వజారోహణం, 15 సాయంత్రం గంధవడి ఉత్సవం, రాత్రికి ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయి. ప్రతిరోజు సాయంత్ర స్వామి, అమ్మవారికి పూలంగిసేవ నిర్వహిస్తారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని అర్చకులు గోపాలకృష్ణమూర్తి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పి రవీంద్రబాబు, ఆలయ ఈవో పెంచల వర ప్రసాదు కోరారు.

వర్సిటీ ఆర్ట్స్ డీన్‌గా డాక్టర్ సునీత నియామకం

వెంకటాచలం, ఏప్రిల్ 4: స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీ కళాశాలలో సోషల్ వర్క్ విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ కనుమూరి సునీతను వీసీ సుందరవల్లి అనుమతితో ఆర్ట్స్ డీన్‌గా నియమిస్తూ గురువారం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై వర్సిటీ ఆర్ట్స్ డీన్‌గా డాక్టర్ కే సునీత విధులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆమెను వర్సిటీ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.


సునీతకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ సుందరవల్లి

బస్సులోనే సీఎం అభివాదం

- కేడర్‌లో నిరుత్సాహం

మనుబోలు, ఏప్రిల్ 4 : నాయుడుపేటలో మేమంతా సిద్ధం సభ ముగించుకుని నెల్లూరు వెళుతున్న సీఎం జగన్ బస్సు యాత్ర గురువారం రాత్రి 7.40 గంటలకు మనుబోలు చేరు కుంది. సీఎం హైవే మీదుగా వెళతారని తెలుసుకున్న వైసీపీ శ్రేణులు కూడలి వద్దకు చేరుకున్నారు. బస్సును చూసిన వెంటనే ఆపాలంటూ కేకలు వేశారు. జనం కేకలు ఉన్న జనం బస్సులో నుంచి నమస్కారం చేసుకుంటూ వెళ్లిపోయారు. 2019 ఎన్నికల సమ యంలో జగన్ పాదయాత్ర మనుబోలు మండలంలో జరగలేదు. ఈసారైనా జగన్ మనుబోలులో ఆగుతారని అనుకున్న అభిమానులకు నిరాశే మిగిలింది.


బస్సులో నుంచే అభివాదం చేస్తున్న సీఎం జగన్

ఆటో - కారు ఢీ : ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 4: ఆటో - కారు ఢీకొని ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన స్థానిక కనిసిరిపాళెం వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కనిసిరిపాళెంకు చెందిన ఆటో డ్రైవర్ రొట్టెముక్కల రాము రాత్రి జాతీయ రహదారిపైనుంచి కనిసిరిపాళెంలో ఇంటికి వెళ్తుండగా సంగం వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రాము తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే 108లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, ఆటోని ఢీకొన్న కారు ఓ ఎమ్మెల్యేదిగా చెప్పారు. కానీ ఏ ఎమ్మెల్యేది అనేది చెప్పలేదు.

నాణ్యతకే మద్దతు ధర!

- పొగాకు చెక్కుల్లో ప్రమాణాలు పాటించకుంటే నష్టమే..
- బోర్డు అధికారుల మార్గదర్శకాలు ఆచరిస్తే ప్రయోజనం

కలిగిరి, ఏప్రిల్ 4: నాణ్యతకే అధిక ప్రాధాన్యం ఉండడంతో పాటు మద్దతు ధర లభిస్తోంది. దీనిని వాణిజ్య పంటైన పొగాకు సాగు చేసే రైతులు కచ్చితంగా పాటించాల్సి ఉంటోంది. పొగాకు చెక్కుల్లో ప్రమాణాలు పాటించకుంటే నష్టాలను ఎదుర్కోక తప్పదు. అదే బోర్డు అధికారులు సూచించే మార్గదర్శకాలను ఆచరిస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతోందని సంబంధిత అధికారులు అంటున్నారు. పొగాకు సాగు చేసిన రైతులు పంట పక్వానికి వచ్చిన సమయంలో ఆకు రెలిచి బ్యారన్‌లో కాల్పులు చేస్తారు. ఈ క్రమంలో సంబంధిత ఆకును గ్రేడింగ్ చేసి చెక్కులను తయారు చేసి విక్రయానికి పొగాకు బోర్డుకు తీసుకువస్తారు. అయితే అందులో ఏమాత్రం నాణ్యత లోపించినా తిరస్కరణకు గురవుతోంది. దీంతో రైతులకు రెట్టింపు పెట్టుబడులై సరైన మద్దతు ధర లేక నష్టపోతుంటారు. కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలో 2023-24 సీజన్‌లో పొగాకు సాగుకు 1200 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. బోర్డు అధికారులు 4.5 మిలియన్ కేజీల కొనుగోలుకు రైతులకు అనుమతి ఇచ్చారు. అయితే గతేడాది చివర్లో పొగాకు కిలో రూ.280 వరకు పలకడంతో ఈ ఏడాది రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. దీని ద్వారా 5.5 మిలియన్ కేజీల దిగుబడి వస్తుందని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మొదటి రకం గ్రేడు పొగాకుకు కిలో రూ.230, తక్కువ గ్రేడ్ పొగాకు కిలో రూ.220 ధర పలుకుతోంది. అయితే రైతులు విక్రయానికి తీసుకొస్తున్న పొగాకు చెక్కుల్లో మిక్సింగ్ గ్రేడ్ ఉండడం వలన బేళ్లు తిరస్కరణకు గురవుతున్నాయని బోర్డు అధికారులు అంటున్నారు. రైతులకు ఈ విషయాలను నిత్యం మెసేజ్‌ల రూపంలో తెలియజేస్తున్నా పలువురు రైతులు గ్రేడింగ్‌లో బోర్డు అధికారుల సూచనలు పాటించకపోవడంతో చెక్కులు నో సేల్, నో బిడ్ కారణాలతో తిరస్కరణకు గురవుతోన్నాయి. ఈ విధంగా తిరస్కరణకు గురైతే సంబంధిత పొగాకు చెక్కులను రైతులు మళ్లీ ఇంటికి తీసుకెళ్లి తిరిగి గ్రేడింగ్ చేయాల్సి ఉంటోంది. దీనివలన రైతుకు వ్యయప్రయాసలతోపాటు అదనంగా కూలీలు, రవాణా ఖర్చులు పెరుగుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని పొగాకును మిక్సింగ్ గ్రేడింగ్ కాకుండా బోర్డు అధికారులు సూచించే ఏ రకానికి సంబంధించి ఆ రకానికి గ్రేడింగ్‌లను చేసి విక్రయానికి తీసుకొచ్చి తిరస్కరణకు గురికాకుండా మద్దతు ధర పొందాలని అధికారులు అంటున్నారు.


చెక్కులు వేయడానికి మండెల్లో ఉన్న పొగాకు

పదో తరగతి బాలిక ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 4: ఇటీవల పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని హరనాథపురంలో పెంచలయ్య, కుమారి దంపతులు నివసిస్తున్నారు. వారికి అజయ్, అశ్విని(15) సంతానం. అశ్విని పదో తరగతి పరీక్షలు రాసి ఇంటి వద్దనే ఉంటోంది. ఆమె స్నేహితురాలు ఇటీవల మరణించింది. ఆ విషయం తెలిసినప్పటి నుంచి అశ్విని మనస్థాపానికి గురైంది. గురువారం తెల్లవారుజామున తన గదిలోని ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇది గమనిం చిన కుటుంబ సభ్యులు గది తలుపులు పగులగొట్టి వెళ్లి చూడగా అప్పటికే బాలిక మృతి చెందింది. బాలిక తండ్రి ఫిర్యాదుతో బాలాజీనగర్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నవోదయ ఫలితాల్లో 'విశ్వం' ప్రతిభ

తిరుపతి(విద్య), ఏప్రిల్ 4: నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో తిరుపతి విశ్వం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి తెలిపారు. 39 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి నవోదయ పాఠశాలల్లో ప్రవేశాలు సాధించారని వెల్లడించారు. లక్ష్మీశ్రీ, జ్యోత్స్న, ఉదయశ్రీ, లాస్య, గౌతం కుమార్, కేతన్ భాస్కర్, లిఖిత, గంగజయదీప్‌రెడ్డి తదితరులు ప్రవేశాలు పొందిన వారిలో ఉన్నారని చెప్పారు. అకడమిక డైరెక్టర్ ఎన్. విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాల వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థ అత్యుత్తమమైందిగా పేరుగాంచిందని చెప్పారు.

మస్తానమ్మ హత్య కేసులో

ముగ్గురు అరెస్ట్

- ప్రెస్‌నోట్‌తో సరిపెట్టిన పోలీసులు
- హత్యకు కారణాల ప్రస్తావన లేకపోవడంపై అనుమానాలు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 4 : నెల్లూరు రూరల్లోని నవలాకులతోట విఘ్నేశ్వర నగర్‌లో గత నెల 27వ తేదీన జరిగిన నాగూరు మస్తానమ్మ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు నెల్లూరు రూరల్ పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు గురువారం మీడియాకు ప్రెస్‌నోట్ విడుదల చేశారు. తీవ్రమైన నేరాలు, దారుణ సంఘటనల కేసులు ఛేదించినప్పుడు పోలీసులు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి వివరాలు తెలుపడం ఆనవాయితీగా వస్తోంది. అయితే అందుకు భిన్నంగా మస్తానమ్మ హత్య కేసు విషయంలో ప్రెస్‌నోట్‌తో చేతులు దులుపుకున్న వైనం అనుమానాలకు తావిస్తోంది. మస్తానమ్మ హత్యకు కారణాలు, నేరం జరిగిన తీరు, నిందితులను పట్టుకున్న విధానం, వారి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు... ఇలాంటి వివరాలేవీ పోలీసుల విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాగా, ఈ హత్య కేసులో పాకంటి దివ్యవాణి ఫిర్యాదు మేరకు నెల్లూరు వెంకటేశ్వర్లు అలియాస్ చంటి, అరవ సునీత, అబ్దుల్ సుభానీలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు ప్రకటించారు. ఈ నేరంలో నాలుగో వ్యక్తి ప్రమేయం కూడా ఉన్నట్లు మొదటి నుంచి అనుమానిస్తున్న పోలీసులు ప్రెస్‌నోట్‌లో ఆ వ్యక్తి ప్రస్తావన చేయకపోవడం గమనార్హం.

నిధులు లేక.. పనుల కాక !

- కొనసాగుతున్న రెండో విడత నాడు-నేడు వర్క్స్
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

కొండాపురం, ఏప్రిల్4: నాడు- నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చుతామని పాలకులు చెప్తూనే ఉన్నారు. పాఠశాలల్లో అన్నీ వసతులను కల్పించి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మార్చుతామనే మాటలు ప్రకటనలకే పరిమితమ య్యాయి. విద్యాసంవత్సరం పూర్తికావస్తున్నా పనులు సాగుతూ నే ఉన్నాయి. నిధులు విడుదలలో జాప్యం జరుగుతుండటంతో పనులు ముందుకు సాగడంలేదు. మండలంలో రెండో విడతలో 24 పాఠశాలలు ఎంపిక చేశారు. మండల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతోపాటు ఆదర్శ, కేజీబీవీ కలిపి మొత్తం 66 పాఠశాలలు ఉన్నాయి. తొలివిడత నాడు-నేడులో 21 పాఠశాలలను ఎంపికచేసి పనులను పూర్తిచేశారు. మలివిడతలో ఎంపికయిన పాఠశాలలకు సుమారు రూ. 8 కోట్ల నిధులను కేటాయించారు.

● పది రకాల పనులు పూర్తిచేయాలి

రెండో విడతలో ఎంపికచేసిన పాఠశాలల్లో 10 రకాల పనులను పూర్తిచేయాల్సి ఉంది. ఇందులో భవన నిర్మాణం, కాంపౌండ్‌వాల్ ఏర్పాటు, కొత్త మరుగుదొడ్లు, భవన మరమ్మతులు, గ్రీన్ చాక్ బోర్డులు, స్మార్ట్ టీవీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విద్యుత్ సౌకర్యం, సురక్షిత తాగునీరు తదితర వసతులను ఏర్పాటుచేయాల్సి ఉంది. ప్రభుత్వం పాఠశాలలకు కేటాయించిన నిధులలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విద్యుత్, తాగునీరు వసతికి సంబంధించిన పలు వస్తువులను ఆయ పాఠశాలలకు నేరుగా పంపిస్తుంది. పనులన్నీ సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎస్ఎమ్‌సీ చైర్మన్ తదితర సభ్యులతో ఏర్పాటుచేసిన కమిటీ పర్యవేక్షణలో జరుగుతాయి. అయితే సివిల్ వర్కులకు సంబంధించి పూర్తిస్థాయిలో నిధులు రాకపోవడంతో ప్రారంభించిన పనులన్నీ మధ్యలో ఆగిపోయాయి. ఇటీవల కొన్ని పాఠశాలలకే నిధులు మంజూరవ్వడంతో తిరిగి పనులను ప్రారంభించారు. పనులు ఆగి పోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు.


సత్యవోలు అగ్రహారం పాఠశాలలో కొనసాగుతున్న పనులు

వైసీపీకి ఒక్కచాన్స్ ఇస్తే రాష్ట్రం నిలువు దోపిడీ



సంగం: వేమిరెడ్డి, ఆనంను గజ పూలమాలతో సత్కరిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు



ఆత్మకూరులో మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

- ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి
- ప్రజాగళంలో వైసీపీపై టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఆనం, వేమిరెడ్డి తీవ్ర విమర్శలు

సంగం, ఏప్రిల్ 4: ఐదేళ్ల కిందట ఒక్కచాన్స్ అని వైసీపీ నాయకులు అడగడంతో ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే రాష్ట్రాన్ని నిలువునా దోచేశారని ఆత్మకూరు ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి ఆనం రామ నారాయణరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం సంగం ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో రాష్ట్రంలో దోపిడీ, విధ్వంసం తప్పా అభివృద్ధి జరుగలేదన్నారు. సంగం, పెరమన మధ్య ఉన్న కొండలు, గుట్టలు మింగేశారని పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలు ప్రశాంతంగా బతకాలన్నా టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాను చేసిన అభివృద్ధి చూసి టీడీపీ సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అంతకు ముందు ఎంపీ అభ్యర్థి వీపీఆర్ మాట్లాడారు.

బైక్ ర్యాలీతో కిక్కిరిసిన ముంబాయి రోడ్డు

ప్రజాగళం బహిరంగ సభకు విచ్చేసిన ఆనం రామనారాయణరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సంగంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. కావలి కాలువ నుంచి సంగం కెనరా బ్యాంకు వరకు జరిగిన బైక్ ర్యాలీలో ముంబాయి జాతీయ రహదారి జనంతో కిక్కిరిసింది.

భారీ చేరికలతో వైసీపీ ఖాళీ..

ప్రజాగళం సభలో వైసీపీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆ పార్టీని వీడి పెద్దఎత్తున టీడీపీలో చేరారు. సంగం సర్పంచు నిమ్మల రమణమ్మ, జంగాలకండ్రిక సర్పంచు సునీల్, వెంగారెడ్డిపాలెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, పడమటిపాళెం సర్పంచు కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, సిద్దీపురం సర్పంచు ప్రసూన్న, పెరమన సర్పంచ్ రమణమ్మ, వైసీపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ గంగపట్న చంద్రశేఖరయ్య, కర్నాటి రవీంద్రరెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, పగడాల రఘురామయ్య, మక్తాపురం మోహన్‌రెడ్డి, అల్లూరు శ్రీధర్‌రెడ్డి అనిల్ కుమార్‌రెడ్డిలు వైసీపీ వీడి టీడీపీ తీర్థపుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఆనం రామనారాయణరెడ్డి పార్టీ కండువాలతో ఆహ్వానించారు.

ఆత్మకూరు: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు అసెంబ్లీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కూటమి నాయకులు సమన్వయంతో ముందుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక రవితేజ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉమ్మడి కూటమి ఆత్మీయ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఎన్డీఏ కూటమి అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించుకుంటే ఆత్మ కూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనంతసాగరం: బొమ్మవరం పంచాయతీలోని అగ్రహారంలోని 30 కుటుంబాలకు చెందిన వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరారు. గ్రామంలో జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి ఆనం రామనారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఏఎస్‌ఆర్‌ఐ అక్కలరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కల్లూరు భాస్కర్‌రెడ్డి, అక్కల రెడ్డి వెంకటసు బ్బారెడ్డి, చల్లా మోహన్‌రెడ్డి, ధనిరెడ్డి ఈశ్వర్ రెడ్డి, పాలగిరి ఇంద్రసేనారెడ్డితో పాటు మరి కొన్ని కుటుంబాలు ఉన్నాయి.

ఉదయగిరి అభివృద్ధిని చేసి చూపిస్తా..

- మేనిఫెస్టోలోని ప్రతిహామీ నెరవేరుస్తా
- గ్రామాల్లో జోరుగా కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారం



కాకర్ల సురేష్‌కు సమస్యలు చెబుతున్న మహిళలు

సీతారామపురం, ఏప్రిల్ 4: నియోజకవర్గ టీడీపీ-జనసేన- బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ గురువారం చిన్ననాగంపల్లి నుంచి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు చింతల శ్రీనువాసులు, మం డల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, చేన్నకేశవులు, జనసేన నియోజకవర్గ నాయకులు బోగినేని కాశిరావు ఆధ్వర్యంలో నాయకులు చిన్ననాగంపల్లి వద్ద కాకర్ల సురేష్‌కు ఘనస్వాగతం పలికారు. తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు మహిళలు భారీ ఎత్తున తరలివచ్చారు. ఇంటింటి ప్రచారానికి వెళ్తున్న ఆయన ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు వింటూ పరిష్కార మార్గాలు చెబుతూ జననీరాజనాలు అందుకున్నారు. మండలంలో మంచినీటి సమస్య, ప్రతీవీధికి సిమెంట్ రోడ్లు, డ్రైనేజ్ సమస్యలు తీరుస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే తల్లికి వందనం పథకం కింద విద్యార్థులకు ఏటా రూ.15వేలు ఇస్తామన్నారు. అన్నదాత పథకం కింద రైతులకు ఏటా రూ.20వేలు అందజేస్తామన్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేస్తామన్నారు. 18 నుంచి 59ఏళ్ల వయసున్న మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ.1500 ఇస్తామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం 50ఏళ్ల పైబడిన బీసీలకు రూ.4వేల పింఛన్ అందజేస్తుందన్నారు. వృద్ధాప్య, దివ్యాంగులు, వితంతు పింఛన్లను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచుతామని, ప్రతినెలా 1వ తేదీన ఇంటి వద్దనే పింఛను అందజేస్తామన్నారు. మహిళలకు కలలకు రెక్కలు పథకం కింద వడ్డీ లేని రుణాలను అందజేస్తామన్నారు. జగన్‌మో హన్‌రెడ్డిపై చేస్తున్న ఈ పోరాటంలో మనతో కలిసి వచ్చే ప్రజల గొంతుకే ప్రజాగళమన్నారు. ఉదయగిరి శాసనసభ అభ్యర్థిగా తనను, పార్లమెంట్ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, సూపర్ సిక్సర్ క్యాలెండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీతారామపురం సర్పంచ్ భాగ్య కుమారి, మాజీ జెడ్పీటీసీ కలివెల జ్యోతి, జాషువా, సర్పంచ్‌లు వెంకటసుబ్బయ్య, ఆదినారాయణ చంద్రారెడ్డి, పెద్దగౌస్, తోట మనోజ్‌బాబు, పిడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఉదయగిరి అభ్యర్థి సోము



ఉదయగిరి రూరల్, ఏప్రిల్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సోము అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు ప్రతి గ్రామం లో ప్రత్యేక ఓటు బ్యాంకు ఉందని, గ్రామస్థాయి నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు, కార్యక ర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని విడిగొట్టేందుకు లేఖ ఇచ్చిన చంద్రబాబు, కేంద్రం మెడలు వచ్చి ప్రత్యేక హోదా తీసుకొస్తానన్న జగన్ ఇద్దరూ కేంద్ర ప్రభుత్వానికి దాసోహం అయ్యారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో తాను ఉదయగిరి కోటపై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్రచౌదరి, విజయ్, బాబురావు, కాలేషా పాల్గొన్నారు.

కురుగొండ్ల సమక్షంలో టీడీపీలో చేరికలు



టీడీపీలో చేరిన తోపుగుంట గ్రామస్థులు

కలువాయి, ఏప్రిల్ 4: వెంకటగిరి మాజీ ఎమ్మె ల్యే కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో గురువారం తోపుగుంట వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. నాపా నావూరయ్య, మాధవ్ నాయుడు ఆధ్వర్యంలో 30కుటుంబాలు తెలుగుదేశంలో చేరారు. వీరందరికీ కురుగొండ్ల టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మం డలాధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, పీర్ల సోమ య్య యాదవ్ ఉన్నారు.

నేడు పింఛనుదారుల సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 4 : నెల్లూరులోని భక్తవత్సలనగర్‌లో గల పెన్షన్‌భవన్‌లో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు ఎస్‌ఎం గౌస్, కార్య దర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు జరిగే ఈ సమావేశంలో పలు అంశా లపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కార్య వర్గం, మండల, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు, ఆఫీసు బేరర్స్, టెక్నికల్ సభ్యులు గౌరవసలహాదారులు అందరూ హాజరుకావాలని కోరారు.

చలివేంద్రాల ప్రారంభం



సంగం: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దారు రమాదేవి

సంగం, ఏప్రిల్ 4: వేసవిని దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం తహసీల్దారు రమాదేవి స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహం తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్ మంచినీటి కుండలు ఏర్పాటు చేయించారు. ప్రతిరోజు తాగునీరు సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వేసవి దృష్ట్యా కార్యాలయానికి వచ్చే రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలను దృష్టిలో ఉంచుకొని తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి నెహ్రూబాబు పాల్గొన్నారు.

మజ్జిగ, మంచినీరు పంపిణీ

వింజమూరు, ఏప్రిల్ 4: పట్టణంలోని సచివాలయాల్లో గురువారం పింఛనుదారులకు తెలుగుదేశం మండల నాయకులు మజ్జిగ, మంచినీటిని అందజేశారు. పార్టీ మండలాధ్యక్షుడు గొంగటి రఘు నాథరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులపై కక్ష సాధింపు చర్యగా పింఛన్‌దారులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. సచివాలయ సిబ్బంది ఉన్నా కూడా ఇంటి వద్దకు పింఛను పంపిణీ చేయ కపోవడం దారుణమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వీఎంసీ చైర్మన్ దంతులూరు వెంకటేశ్వర రావు, మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, చల్లా వెంక టేశ్వర్లు, సుబ్బారెడ్డి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

దాసరిపల్లిలో ఇఫ్తార్ విందు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 4: పవిత్ర రంజాన్ మాసాన్ని పురష్కరించుకొని దాసరిపల్లి గ్రామంలో మాజీ సర్పంచు సయ్యద్ జమృత్ జాఫర్‌మొహిద్దీన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. టీడీపీ నేతలు వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చంచల బాబుయాదవ్, మాజీ ఎంపీపీలు చేజర్ల సుబ్బారెడ్డి, శ్రీకుర్తి రవీంద్రబాబు నాయకులు కాకర్ల సునీల్, బయన్న, రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, సయ్యద్ నవాజ్, శివకృష్ణ పాల్గొన్నారు.

మూడుసార్లు వాటర్‌బెల్ కొట్టాలి


ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 4: వేసవి దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలో రోజుకు మూడుసార్లు వాటర్‌బెల్ కొట్టాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో ఉదయం 8.45, 10.05, మధ్యాహ్నం 11.50 గంటలకు వాటర్‌బెల్ కొట్టాలన్నారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం

వింజమూరు, ఏప్రిల్ 4 : పట్టణంలోని గ్రంథాలయం సెంటర్‌లో గురువారం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కంభం బాలకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, మండల కన్వినర్ శ్రీనివాసరెడ్డి, రేవునూరి శ్రీనివాసురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: ఈ ఎన్నికల్లో కష్టపడిన వారికే నాయకులుగా, కార్యకర్తలుగా ఎమ్మెల్యే గుర్తించ నున్నారని వైసీపీ మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, మోహన్‌రెడ్డి తెలిపారు. జేసీఎస్ కన్వీనర్ మోహన్‌రెడ్డి, భీమవరం సొసైటీ చైర్మన్ మాధవ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

నిదరోతున్న నిఘా నేత్రం



పనిచేయని సీసీ కెమెరా

వలేటివారిపాలెం, ఏప్రిల్ 4: ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమంటూ పోలీసు అధికారులు తరచూ చెబుతుంటారు. దీన్ని బట్టి చూస్తూ సీసీ కెమెరాకు ఎంత ప్రాధాన్యం ఉందో తెలుస్తోంది. అలాంటి సీసీ కెమెరాలు మండలంలోని కూనిపాలెం, చుండి, వలేటివారిపాలెం, పోకూరు గ్రామాల్లో రెండేళ్ల నుంచి పనిచేయడంలేదు. అయినా వీటి మరమ్మతులను పోలీసులు పట్టించుకోవడంలేదు. రెండేళ్ల క్రితం వలేటివారిపాలెంలో పోలీసులు ప్రజాప్రతినిధులు, దుకాణ యజమానులకు అవగాహన కల్పించి, స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. కొన్ని రోజులు బాగానే పనిచేశాయి. అనంతరం మరమ్మతులకు గురయ్యాయి. ఇవి పనిచేయకపోవడంతో గొర్రెలు, పొట్టేళ్లను దుండగులు అపహరించుకపోతున్నారు బస్టాండు సెంటరులోని దుకాణాలు తాళాలను దుండగులు పగులగొడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడంలేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తానని ఎస్‌ఐ బాలమహేంద్రనాయక్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

మునునూరుకు సకల సౌకర్యాలు కల్పిస్తా : కావ్య



టీడీపీలో చేరుతున్న నాగులవరం మాజీ సర్పంచి



అల్లూరలో బీద గిరిధర్ ప్రచారం

కావలి, ఏప్రిల్4: సమస్యల నిలయంగా ఉన్న కావలి మునునూరుకు సకల సౌకర్యాలు కల్పిస్తానని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తె లిపారు. మునునూరులోని 14వ వార్డులో గురువారం ఆయన జనసేన ఇన్ చార్జి అళహరి సుధాకర్, ఆలా శ్రీనాథ్, బీజేపీ నేత మందా కిరణ్‌లతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటికి పరిష్కార మార్గం చూపిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జ్యోతి బాబూరావు, బొట్లగుంట శ్రీహరినాయుడు, ఉప్పు వెంకటస్వామి, రావినూతల వెంకటేశ్వర్లు, లింగాల మాల్యాద్రి పాల్గొన్నారు.

- **విష్ణు అనుచరులు టీడీపీలో చేరిక**

మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు, బోగోలు మండలం నాగులవరం మాజీ సర్పంచి గణేశం రమేష్ రెడ్డితో పాటు మండలానికి చెందిన మాధవి, ప్రవీణ్, వంశీ, గణేష్ తదితరులు కావ్య క్రిష్ణారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలనుకప్పి కావ్య సాదరంగా ఆహ్వానించారు.

- **ప్రతాప్‌ను ఇంటికి పంపుదాం..**

కావలి రూరల్: రుద్రకోట కొండను తొలిచిన కాలకేయుడు వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోటలో గురువారం రాత్రి జరిగిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. అరుంధతీయవాడ, ఎస్టీకాలనీ, వడ్డిపా లెం, గుమ్మడిబొందల ప్రాంతాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అళహరి సు ధాకర్, సిద్దు, టీడీపీ నేతలు కండ్లగుంట మధుబాబునాయుడు, ఆవుల రామక్రిష్ణ, తుళ్లూరు మల్లికార్జున్, పేరం రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

- **ఏనుగులబావిలో టీడీపీ ప్రచారం**

బిట్రగుంట : బోగోలు మండలం ఏనుగులబావి పంచాయతీలో గురువారం రాత్రి మండల టీడీపీ కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రె డ్డి, కావలి అభ్యర్థి కావ్యక్రిష్ణారెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచా రం నిర్వహించారు. కార్యక్రమంలో దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డి, పంది శ్రీనివాసులు, ఒంటేరు ప్రసన్న, బడుగు వెంకయ్య, యల్లమ్మ, జంపాని ప్రసాద్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

- **గెలిపిస్తే.. అభివృద్ధి ఏమిటో చూపిస్తాం...**

అల్లూరు : టీడీపీని గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరు దళితవాడల్లో గురువారం సాయంత్రం కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఎ.చరణ్‌రెడ్డిలతో కలసి ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బండి శ్రీనివాసులురెడ్డి, కృష్ణ చైతన్య, పెనుమల్లి శ్రీనివాసులురెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సూరిజ్యోతి, అనూరాధ, కావలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో బందోబస్తు

ఉదయగిరి, ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలో 43సమస్యాత్మక గ్రామా లను గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ గురువారం తెలిపారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 323 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. అత్యధికంగా కలిగిరిలో 53కేంద్రాలు ఉండగా అత్యల్పంగా సీతారామపురం మండలంలో 25 ఉన్నట్లు పేర్కొన్నారు.

రంగస్థల నటుడు కోటేశ్వరరావు కన్నుమూత



కోటేశ్వరరావు (ఫైల్)

కందుకూరు : ప్రముఖ రంగస్థల నటుడు కేవీ కోటేశ్వరరావు (82) గురువారం కన్నుమూశారు. పౌరాణిక నాటకాల్లో తన కంచుకంఠంతో ప్రత్యేక గుర్తింపు పొందిన కోటేశ్వరరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కందుకూరులోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. హరిశ్చంద్ర కాటిసీనులో కేవీ కోటేశ్వరరావు అభినయం, ఆయన కంచుకంఠంతో పాడే పద్యాలు కళాకారుల్లో ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. గయోపాఖ్యానం, శ్రీకృష్ణతులాభారం, చింతామణి తదితర నాటకాలలో నటించి ఆయన గుర్తింపుపొందారు. కోటేశ్వరరావు మృతిపట్ల పలువురు కళాకారులు, కళాభిమానులు సంతాపం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గుడ్లూరు : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు.ఈ సంఘటన, మండలంలోని పరకొండపాడులో చోటుచేసుకుంది. మన్నేరు నుంచి గురువారం తెల్లవారుజామున ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందగా, పోలీసులు అక్కడి వెళ్లి ట్రాక్టర్లను, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కందుకూరు కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై వేటు

ఉలవపాడు : మండలంలోని కరేడు పంచాయతీ కార్యదర్శి కేఎస్ చక్రవర్తిపై పలు అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషన్ ఆయన్ను సస్పెన్షన్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యదర్శిపై స్థానికులు అవినీతి ఆరోపణలు చేస్తూ, ఆధారాలతో పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ విషయమై ఎంపీడీవో విజయను వివరణ కోరగా ఫిర్యాదుదారుడు సస్పెన్స్ కాపీని అందించాడని తెలిపారు.

వాహనాల్లో రూ. 5లక్షల పట్టివేత

ఉలవపాడు : ఉలవపాడు జాతీయ రహదారిపై మన్నేటికోట అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద గురువారం సిబ్బంది వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా రూ. 5లక్షలు పట్టుబడినట్లుగా ఎస్సై బాజిరెడ్డి తెలిపారు. విజయవాడ నుంచి నెల్లూరు వెళ్తున్న కారులో ఎస్కే. సైదా వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలోని చాకిచర్ల, పెదపట్టపుపాలెం, రామాయపట్నం గ్రామాల్లో కేంద్రబలగాలతో ఎస్సై కవాతు నిర్వహించారు.

బీటెక్ విద్యార్థులకు దేశ విదేశాల్లో ఉద్యోగావకాశాలు

బిట్రగుంట : బీటెక్ విద్యార్థులకు దేశవిదేశాల్లో కూడా ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని వీఎస్‌యూ వీసీ జీఎం.సుందరవల్లి, హైదరాబాద్ చెందిన ది బ్లాక్ బగ్స్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో తోట అనురాధలు తెలిపారు. బోగోలు మండలం కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో గురువారం రాత్రి జరిగిన వార్షికోత్సవంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఓవరాల్ అకడమిక్ సెమిస్టర్స్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు మెడల్స్ అందచేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ప్రిన్సిపాల్ పీ వీఎస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గెస్ట్ ఆఫ్ ఆనర్స్‌గా డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌రెడ్డి ఆర్వీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టు వద్ద తనిఖీల పరిశీలన

కావలి, ఏప్రిల్4: పట్టణ మునునూరు టోల్‌గేట్ వద్ద హైవేపై వెళుతున్న వాహనాల తనిఖీ కోసం ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును గురువారం కావలి ఆర్వో శీనానాయక్ పరిశీలించారు. అక్కడ వాహనాల తనిఖీలు ఎలా నిర్వహిస్తున్నారు. ఎలాంటి వాహనాలను ఆపుతున్నారు. వాటిలో ఎక్కడెక్కడ తనిఖీలు చేస్తున్నారో పరిశీలించారు. ఈ తనిఖీలలో నగదు, మద్యం ఎక్కడా లభించలేదని ఆయన తెలిపారు.

ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య



కరపత్రాలు పంపిణీచేస్తున్న ఇంటూరి సౌజన్య

కందుకూరు, ఏప్రిల్ 4: పట్టణంలోని 30వ వార్డు నాంచారమ్మ కాలనీ, కోర్టు వెనుక వైపు ప్రాంతాల్లో కందుకూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావును, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతిఒక్కరూ తోడ్పాటునివ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముచ్చు శ్రీను, ముచ్చు లక్ష్మీరాజ్యం, సవిడిబోయిన వెంకటకృష్ణ, పసుపులేటి రమణయ్య, భోగిశెట్టి మోహనరావు, నీలిశెట్టి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- **తెలుగు మహిళల ప్రచారం**

జలదంకి : మండలంలోని కమ్మవారిపాలెంలో గురువారం సాయంత్రం టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లకు ఓట్లేసి గెలిపించాలంటూ తెలుగు మహిళలు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో పూజలు నిర్వహించి, అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రచారంలో నేతలు వంటేరు పద్మావతి, కాకర్ల తల్లిదండ్రులు వెంకటసుబ్బానాయుడు, ప్రమీలమ్మ, అత్తమామలు కడియాల వెంకటేశ్వర్లు, పద్మావతి, పీ మధుమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై తప్పుడు ప్రచారం



మాట్లాడుతున్న దామా అంకయ్య తదితరులు

కావలి, మార్చి4: పింఛన్ల పంపిణీపై వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయటం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికలప్పుడు వైసీపీ ప్రభుత్వం అలజడులు సృష్టించేందుకు కోడికత్తి, వివేకానందరెడ్డి హత్య కేసుల డ్రామా ఆడిందన్నారు.ఇప్పుడు పింఛన్ల పంపిణీలో ప్రతిపక్షాలపై వైసీపీ తప్పుడు ప్రచారాలు చేస్తున్నదన్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. రాజకీయాలు చేయకుండా పనిచేస్తే వలంటీర్లకు సీపీఐ అండగా నిలుస్తుందన్నారు. సమావేశంలో నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇంటి వద్దే పింఛను



దివ్యాంగుడికి ఇంటివద్దే పింఛన్ అందచేస్తున్న మున్సిపల్ కమిషనర్, టీపీఎస్ తదితరులు

కావలి, ఏప్రిల్4: సచివాలయాలకు రాలేని వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే పింఛన్లు అందచేశామని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. పింఛన్ల పంపిణీకి సచివాలయాల వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేశారు ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నాయా ? అనే విషయాలను గురువారం ఆయన పరిశీలించారు. కచ్చేరి మిట్టలోని 18వ సచివాలయం పరిధిలో ఓ దివ్యాంగుడి ఇంటికి వెళ్లి కమిషనరే పింఛను అందచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళికాధికారి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

- **90 శాతం పింఛన్ల అందజేత**

లింగసముద్రం: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 90 శాతం సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్టు ఎంపీడీవో యు శేషుబాబు చెప్పారు. మండలంలోని తిమ్మారెడ్డిపాలెం, వీఆర్ కోట, మొగిలిచెర్ల గ్రామ సచివాలయాల్లో పింఛన్ల పంపిణీని గురువారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన వీఆర్ కోట సచివాలయంలో కొంతమంది లబ్ధిదారులకు పింఛన్ల నగదును అందజేశారు. బయటి ప్రాంతాలు, ఇతర పట్టణాల్లో ఉంటున్న వారికి సమాచారం అందజేశామని, వారికి ఈ రెండు రోజుల్లో నగదు అందజేస్తామన్నారు.

ఇంటి వద్దే పింఛన్ పంపిణీ

అల్లూరు : సచివాలయాలకు వచ్చిన లబ్ధిదారులకు గురువారం సాయంత్రం వరకు పింఛన్లు అందజేయగా, దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వారికి అధికారులు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందచేశారు. ఎండకు వచ్చే లబ్ధిదారుల కోసం తాగునీరు, షామియానా, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అధికారులు అందుబాటులో ఉంచారు. ఎట్టకేలకు మండలంలో అధికారులు పింఛన్ల పంపిణీని పూర్తి చేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

కలిగిరి : ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ సంతోష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన కేంద్రబలగాలతో కలిసి కలిగిరి, పెద్ద అన్నలూరు, కృష్ణారెడ్డిపాలెం గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నా మని ఆయన తెలిపారు.

వైసీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే విష్ణు

అల్లూరు : మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం సీఎం జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. అల్లూరులోని తన నివాసం నుంచి ఆయన అభిమానులతో కలసి వెళ్లి రేణిగుంట వద్ద పర్యటనలో ఉన్న జగన్మోహన్‌రెడ్డిని కలుసుకొని పార్టీలో చేరారు.

ప్రజాసేవ మాత్రమే తెలుసు

● గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం..

● కొడవలూరు మండలంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రచారం



ప్రజలకు అభివాదం తెలుపుతున్న ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, ఏప్రిల్ 4: ప్రజలకు సేవ చేయడం తప్ప గ్రావెల్, ఇసుక దోచుకోవడం, దోపిడీ విధానం తమకు తెలియదని అధికార పార్టీ నాయకులను ఉద్దేశించి కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో గౌతమినగర్ పంచాయతీ, బొడ్డువారిపాలెం, రేగడిచెలిక, నాయుడుపాలెం గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తనను శాసనసభ సభ్యురాలిగా ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామాలను అభివృద్ధిపరుస్తామన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. అలాగే తాను ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. అలాగే నాయుడుపాలెం గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్, రోడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నాలుగు పంచాయతీలకు కలిపి 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, ఇరువూరి శ్రీధర్‌రెడ్డి, జి శేఖర్‌రెడ్డి, మాగుంట సతీష్‌రెడ్డి, పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, చెక్క మదన్, కేతు వెంకటరమణరెడ్డి, చెముకుల వెంకయ్య, వినీల్‌రెడ్డి, గరికపాటి రాజేంద్రకుమార్, బొల్లినేని ఉషారాణి, రూప, కాటంరెడ్డి ప్రసూన, తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ కార్యాలయం ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక పార్టీ కార్యాలయం నుంచే ఎన్నికల ప్రచార కార్యక్రమాలు జరుగుతాయని ఎన్డీఏ కూటమి కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం బుచ్చిలో టీడీపీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ఇకపై నాయకులంతా పార్టీ కార్యాలయంలో అందుబాటులో వుంటారన్నారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, ఎంవీ శేషయ్య, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుబ్రమణ్యంనాయుడు, మురళి, హరనాద్, ప్రసాద్, కల్యాణ్, వైష్ణవి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముడుపులు తీసుకుని పార్టీలు మారే సంస్కృతి నీదే..

● ప్రసన్నపై టీడీపీ నేతల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి

విడవలూరు, ఏప్రిల్ 4: ముడుపులు తీసుకుని పార్టీలు మారే నీచ సంస్కృతి కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిదేనని స్థానిక ఉమ్మడి పార్టీ నాయకులు ఆరోపించారు. విడవలూరులో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో బెజవాడ వంశీకృష్ణారెడ్డి, మాతూరు శ్రీనివాసులురెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, కనుపర్తి నాగేంద్ర, బర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ ముడుపులు తీసుకుని ఎవరు పార్టీలు మారుతున్నారో జొన్నవాడ కామాక్షమ్మ వద్ద ప్రమాణానికి మేము సిద్ధంగా ఉన్నామని వారు ప్రసన్నకి సవాల్ విసిరారు. రాజకీయాల్లో వ్యక్తి గత విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎన్ని విమర్శలు చేసినా త్వరలో జరగనున్న ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిల్ల గెలుపు తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామిరెడ్డి విజయబానురెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, ఉచ్చూరు సుధీర్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, తాతా ప్రభాకర్, వేగూరు చంద్రారెడ్డి, ఓగు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరికలు

ఇందుకూరుపేట: కొమరిక గ్రామ సర్పంచ్, వైసీపీ నాయకులు తిక్కవరపు వసుంధరమ్మ, సుధాకర్‌రెడ్డి దంపతులు గురువారం ప్రశాంతిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా కుడితిపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు పులి వీరయ్య, సుధాకర్, ఇస్మాయిల్ తదితరులకు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ వీరేంద్రచౌదరి, పొన్నెబోయిన చెంచు కిషోర్ యాదవ్, జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి, మునగాల రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

● పాటూరులో నీలిమారెడ్డి ప్రచారం

కోవూరు: టీడీపీ అభ్యర్థి వేమి రెడ్డి ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి గురువారం మండల పరిధిలోని పాటూరు గ్రామంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఆమెవెంట టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, దివ్యారెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు పోలిశెట్టి సుబ్బారావు, దుర్గం చంద్రయ్య, నాగిశెట్టి రఘు ఉన్నారు.

కోవూరులో టీడీపీ ఇంటింటి ప్రచారం

కోవూరు: స్థానిక డొమ్మరిపాలెం, దాసరిపాళెం కాలనీల్లో గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శ్వేతారెడ్డి, అనీష్‌రెడ్డి, నాటకరాని వెంకట్, చెరుకూరి మహేష్, మన్నేపల్లి రమేష్, బాబు, శంకర్, రాజేష్, గంగాద్రి, షేక్ అహమ్మద్ ఇంటింటికీ తిరిగి వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని, రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

విడవలూరు: వేమిరెడ్డి దంపతులకు మద్దతుగా విడవలూరులో గురువారం టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మ్యానిఫెస్టోని ఓటర్లకి వివరించి ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిలకు ఓటు వేయ్యాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణచైతన్య, మండలపార్టీ అధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యవోలు సత్యంరెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

కాకుటూరులో వైసీపీకి గట్టి షాక్

● టీడీపీలోకి సర్పంచి, వార్డు సభ్యుల చేరిక



టీడీపీలో చేరిన కాకుటూరు వైసీపీ సర్పంచి డబ్బుగుంట వెంకమ్మ, వార్డు సభ్యులు

వెంకటాచలం, ఏప్రిల్ 4: మండలంలోని కాకుటూరు పంచాయతీలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. గురువారం సాయంత్రం వైసీపీ సర్పంచ్ డబ్బుగుంట వెంకమ్మ, వార్డు సభ్యులు దోడ్డక జ్యోతి, బండి నారాయణమ్మ, మట్టిపు కమలాకర్, పచ్చబట్ల హరి, పీ బాలు, ఏడుకొండలు, సురేష్, రాజేష్, శ్రీకాంత్, శ్రీనివాసులు, కిషోర్, గోపాల్, అశోక్, ప్రసాద్‌తో సహా 30 కుటుంబాలు, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు నెల్లూరులోని వేదాయపాళెంలో సోమిరెడ్డి కార్యాలయంలో టీడీపీలో చేరారు. వీరికి సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి అరాచకాలను సహించలేక వైసీపీ కీలక నాయకులు సైతం టీడీపీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, నాయకులు డబ్బుగుంట సురేంద్ర, బండి శీనయ్య, మల్లి కృష్ణయ్య, డబ్బుగుంట మల్లికార్జున్, ఆత్మకూరు వెంకటసుబ్బయ్య, ఆత్మకూరు ఆదిశేషయ్య, ఆత్మకూరు వెంకయ్య తదితరులున్నారు.

40 కుటుంబాలు టీడీపీలో చేరిక

పొదలకూరు: పట్టణానికి చెందిన దర్శి విజయ్‌బాబు (కరెంటు బాబు) ఆధ్వర్యంలో గురువారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన నివాసంలో పొదలకూరుకి చెందిన 40 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈసందర్భంగా విజయ్‌బాబును, ఆయన అనుచరులను సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారన్నారు.


ఇంటివద్దకే రేషన్ సరుకులు అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

మనుబోలు, ఏప్రిల్ 4: ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించాలంటూ స్థానిక టీడీపీ నాయకులు గురువారం తహసీల్దార్ చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ మండలంలో నాలుగు చోట్ల ఎండియూ ఆపరేటర్లు రాజీనామా చేశారని, ఆయా ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా ఆపరేటర్లను పెట్టి గతంలో లాగానే ఇళ్ళకు నిత్యావసర సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ వినతిపత్రాన్ని కలెక్టర్‌కు పంపి, ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో దండు చంద్రశేఖర్‌రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, రావుల అంకయ్య గౌడ్, కోసూరు ప్రసాద్ గౌడ్, జితేంద్ర గౌడ్‌లు పాల్గొన్నారు.

సల్లా మౌలాలికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వర్సిటీ వీసీ

వెంకటాచలం, ఏప్రిల్ 4 : స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో నెల్లూరు సంతపేటకు చెందిన సల్లా శ్రీనివాసులు, సరోజనమ్మ దంపతుల కుమారుడైన సల్లా మౌలాలి సోషల్ వర్క్ విభాగంలో పరిశోధనలు చేశాడు. దీనికిగాను సల్లా మౌలాలికి గురువారం వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ మధుమతి పర్యవేక్షణలో సల్లా మౌలాలి పరిశోధన చేసినందుకు గాను వీఎస్‌యూ వీసీ సుందరవల్లి చేతులమీదుగా డాక్టరేట్ ప్రదానం చేశారు. దీంతో మౌలాలిని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీ రామచంద్రారెడ్డి, ఆర్ఎన్‌డీ డీన్ సుజాఎస్ నాయర్, డాక్టర్ ఆర్ మధుమతి, డాక్టర్ కే సునీత, సహాయక పరీక్షల నియంత్రణాధికారి కేవీఎల్ శ్రీకన్యరావు, పరిశోధన విద్యార్థులు అభినందించారు.

విద్యార్థులకు ఇఫ్తార్ విందు

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 4: మండలంలోని సౌత్ ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ అహ్మద్‌బాషా విద్యార్థులకు ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం మురళీ, కె వసంతలక్ష్మీ, కె హెప్సీవిద్యుల్లత, బి కృష్ణవేణి, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఇందుకూరుపేట, ఏప్రిల్ 4: మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్‌కె ఖాదర్‌వలి గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ఈకార్యక్రమంలో డీపీఎంఓ వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, డీపీసీ జి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం..

రాపూరు(డక్కిలి) : కోటూరుపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ బి.హేనసుజన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కేంద్రంలోని తాగునీటి బోరుని కొందరు అక్రమంగా ఆక్రమించుకొన్నారన్న ఫిర్యాదు మేరకు విచారించారు. తహసీల్దార్ కార్యాలయం అధికారులతో సర్వే చేయించి అంగన్‌వాడీ స్థలాన్ని, బోరుని తమ శాఖ ఆధీనంలోకి తీసుకొంటామన్నారు. రాపూరులోని బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా పరిశీలించారు.

నార్తురాజుపాళెంలో ప్రచారం

కొడవలూరు: నియోజకవర్గంలో పేదల అభ్యున్నతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితోనే సాధ్యమని మాజీ గ్రంథాలయ చైర్మన్ మందపాటి ప్రవీణ్ అన్నారు. నార్తు రాజు పాలెంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా శ్రీవెంకటేశ్వస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకుడు తువ్వారా ప్రవీణ్, దిలీప్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమణారెడ్డి, కె మురళీ పాల్గొన్నారు.

నేడు పింఛనుదారుల సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 4 : నెల్లూరులోని భక్తవత్సలనగర్‌లో గల పెన్షన్‌భవన్‌లో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, కార్యదర్శి ఎస్‌వీవీఎన్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

● టీడీపీ నగర అభ్యర్థి పొంగూరు నారాయణ



పార్టీలోకి నేతలను ఆహ్వానిస్తున్న నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 4 : రాష్ట్రంలో అరాచక పాలనకు రోజులు దగ్గరపడ్డాయని, జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని 3, 5 డివిజన్లకు చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నారాయణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా ఒక్క చంద్రబాబు నాయుడికే ఉందన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగే అరాచక పాలనను ప్రజలంతా గమనించారని, అక్రమ కేసులు, దౌర్జన్యాలు, అరాచకాలకు ప్రజలంతా విసిగిపోయి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, పొంగూరు సింధూర, తాళ్లపాక అనూరాధ, మామిడాల మధు, విజేతరెడ్డి, శోభన్, సుబ్బారెడ్డి, రమణారెడ్డి, నారాయణరెడ్డి, శివ యాదవ్, కేవీఆర్ యాదవ్, ఎస్‌వీఆర్ యాదవ్, సత్యం, శీనయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, నగరంలోని 39, 40, 50 డివిజన్లలోనూ నారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 10వ డివిజన్‌లో నారాయణ కుమార్తె శరణి ప్రచారం చేశారు. 4వ డివిజన్‌లో పొంగూరు నారాయణ, ఆయన కుమార్తె సింధూర ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుతానని నారాయణ హామీ ఇచ్చారు.

విజయానికి కృషి చేస్తాం... : బీజేపీ

ఎన్నికల్లో నారాయణ విజయానికి కృషి చేస్తామని బీజేపీ నేతలు తెలిపారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరమ్మ, సాయిచందన హాస్పిటల్ అధినేత అంజనీ కుమార్‌ను వారి నివాసంలో పొంగూరు నారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ నేతలంతా కలిసి మీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని నారాయణకు హామీ ఇచ్చారు.

జనసేన నేతల సత్కారం...

చిరంజీవి యువత ఆధ్వర్యంలో 40వ డివిజన్ అధ్యక్షుడు చిత్తూరు రాము, ఇతర నాయకులు గురువారం పొంగూరు నారాయణను సత్కరించారు. రానున్న ఎన్నికల్లో నారాయణ కృషి చేస్తామని తెలిపారు.

నేడు జగ్జీవన్‌రామ్ జయంతి

నెల్లూరు (వీఆర్సీ), ఏప్రిల్ 4 : స్వాతంత్ర్య సమర యోధుడు, దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని శుక్రవారం అధికారికంగా నిర్వహించనున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆ మహనీయునికి నివాళులు అర్పించనున్నారు.

రాజరాజేశ్వరికి బంగారు గొలుసు బహూకరణ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 4 : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి గురువారం 52.600 గ్రాముల బంగారు గొలుసు కానుకగా లభించింది. అమ్మవారి భక్తులు గంటా రమణయ్య నాయుడు దంపతులు ఆలయ సహాయ కమిషనర్, ఈవో జే వెంకట సుబ్బయ్యకు ఆభరణాన్ని అందజేశారు. దాని విలువ సుమారు రూ.3,68,000 అని దాత తెలిపారు.

బీజేపీలోకి భారీగా చేరికలు



బీజేపీలో చేరిన వైసీపీ నేతలు

ఇందుకూరుపేట, ఏప్రిల్ 4: ఇందుకూరుపేట వైసీపీ యువజన విభాగ నాయకుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి ఆయన సతీ మణి లావణ్యతోపాటు 500 మంది కార్యకర్తలు గురువారం బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలకు సంక్షేమం, సుపరి పాలన అందిస్తున్న బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సెల్స్ ఇనార్జ్ పీ సురేంద్రరెడ్డి, కోవూరు అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ ఇండ్ల రాఘవేంద్రరావు, నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, మారుబోయిన శ్రీనివాసులు, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

ఎవరెన్ని డ్రామాలాడిన చంద్రబాబే సీఎం

● రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 4 : రాష్ట్రంలో ఎవరెన్ని డ్రామాలాడిన చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని నీలగిరి సంఘంలో ఆయన అట్టహాసంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఒకచేత్తో ఇచ్చినట్టు ఇచ్చి మరో చేత్తో లాగేసుకునే వైసీపీ ప్రభుత్వం మనకొద్దని ప్రజలు తీర్మానించుకున్నారన్నారు. వృద్ధులు, వితంతువుల పింఛన్ విషయంలో వైసీపీ చేసిన శవరాజకీయాలను ప్రజలంతా కళ్లారా చూశారన్నారు.

టీడీపీలోకి మల్లెబోయిన

రూరల్ నియోజకవర్గ పరిధిలోని 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్, వైసీపీ డివిజన్ ఇన్ చార్జి మల్లెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్ వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నట్లు గురువారం మీడియా ఎదుట ప్రకటించారు. ఈ సమాచారం తెలుసుకున్న రూరల్ టీడీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి వెంకటేశ్వర్లు యాదవ్ ఇంటికి వెళ్లి కలిశారు. శుక్రవారం వీపీఆర్ సమక్షంలో వెంకటేశ్వర్లు యాదవ్ టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. అంతకు ముందు కనుపర్తిపాడుకు చెందిన పలువురు శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

వలంటీర్లూ.. రాజీనామా చేయొద్దు

వైసీపీ నాయకులకు భయపడి వలంటీర్లు రాజీనామా చేయొద్దని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి, బీజేపీ నేత ఈశ్వరయ్య సూచించారు. వారు గురువారం రూరల్ అభ్యర్థి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. వృద్ధులను మంచాల మీద రోడ్లపైకి తీసుకురావాల్సిన అవసరం వైసీపీ నాయకులకు ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ వలంటీర్ల సేవలను మాత్రమే వాడుకోవద్దని చెప్పింది తప్ప మిగతా అధికారులు, సిబ్బందిని కాదని తెలిపారు.

అలరిస్తున్న త్యాగరాజ స్మరణోత్సవాలు



గాత్ర కచేరీ చేస్తున్న డాక్టర్ కశ్యప్ మహేష్

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 4 : నగరంలోని పురమందిరం ప్రాంగణంలో జరుగుతున్న త్యాగరాజ స్మరణోత్సవాలు సంగీతప్రియులను అలరిస్తున్నాయి. గురువారం ఉదయం త్యాగరాజ స్వామి సహితంగా సీతారామ లక్ష్మణులకు విశేష పూజలు జరిగాయి. నంది వసంతకుమారి భాగవతారిణి ద్రౌపదీ కల్యాణం హరికథను గానం చేశారు. మధ్యాహ్నం పురాణం విజయలక్ష్మీ శివపార్వతుల కల్యాణం హరికథా గానం చేసి శ్రోతల ప్రశంసలు అందుకున్నారు. సాయంత్రం వర్ధమాన గాయకులు త్యాగరాజ పంచరత్న ఘోష్ఠి గానం చేశారు. రాత్రి తిరుచ్చికి చెందిన డాక్టర్ కశ్యప్ మహేష్ బృందం సంగీత గాత్ర కచేరీ వీనుల విందు చేసింది. శుక్రవారం ఉదయం 10గంటలకు సీతారామ కల్యాణం, 12గంటలకు అన్న ప్రసాద వితరణ, రాత్రి 8గంటలకు ఏకాంతసేవ, విశేష కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులందరూ తరలి రావాలని స్మరణోత్సవ సభ శాశ్వత కార్యదర్శి డాక్టర్ వై నాగదేవిప్రసాద్ కోరారు.

18 నుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు

● శాస్త్రోక్తంగా గుంజ ప్రతిష్ఠ



నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 4 : నగరంలోని మూలాపేటలోగల రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 18 నుంచి 28వతేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించి గురువారం ఆలయంలో గుంజ ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళి రెడ్డి, ధర్మకర్తలు, సహాయ కమిషనర్ వీ గిరికృష్ణ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారాల్లో ఉల్లంఘనలు

● సిటీ ఆర్వో వికాస్ మర్మత్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న వికాస్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 4 : నెల్లూరు నగరంలో జరిగే ఎన్నికల ప్రచారాల్లో అక్కడక్కడ ఉల్లంఘనలు జరుగుతున్నాయని సిటీ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన సమీక్ష జరిపారు. ఉల్లంఘనలను సరిచేసుకుని కచ్చితంగా ఎన్నికల అధికారుల నుంచి అనుమతులు పొందాలని సూచించారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందిస్తున్నామని స్పష్టం చేశారు. ఇందులో ఫిర్యాదు చేసే వారు ముందుగా అన్ని విషయాలు తెలుసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీల కరపత్రాల్లో అన్ని వివరాలు స్పష్టం ఉండాలన్నారు.

నేత్రదానం

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 4 : నగరంలోని బాలాజీనగర్‌కు చెందిన నారాయణ (80) గురువారం మృతి చెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్రదాన కౌన్సిలర్ బాలాజీసింగ్, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి టెక్నీషియన్ లాలేష్ మృతుని నేత్రాలను సేకరించారు.

విశ్రాంత ఉద్యోగులకు కంటి వైద్యశిబిరం

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 4 : ఏపీస్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు గురువారం నగరంలోని టౌన్‌హాల్లో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ప్రీతం, వారి సిబ్బంది పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. 30 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని నిర్ణయించి, వారికి ఆరోగ్యకార్డులపై ఆపరేషన్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ, కార్యదర్శి వెంకయ్య, డీ మురళి మోహన్‌రావు, నళినీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్కూల్‌కు నోటీసులు

నెల్లూరు(సిటీ): కార్పొరేషన్ నుంచి తీసుకోవాల్సిన అనుమతులు, పాటించాల్సిన నిబంధనలు అతిక్రమించడంతో మాగుంట లేఅవుట్‌లోని కేకేఆర్ గౌతమ్ విద్యా సంస్థకు నోటీసులు జారీ చేసినట్లు ఎంహెచ్‌వో వెంకట రమణయ్య తెలిపారు. గురువారం పారిశుధ్య పరిశీలన, ట్రేడ్ లైసెన్స్, ఎన్‌వోసీల తనిఖీల్లో భాగంగా గౌతమ్ స్కూల్ తోపాటు, ఎస్‌ఆర్‌కే స్కూల్‌ను పరిశీలించామని తెలిపారు. నగరంలో ప్లాస్టిక్ కవర్ల విని యోగాన్ని పూర్తిగా నిలువరించేందుకు మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు స్టోన్‌హౌస్‌పేట తోటబడిలో సమీక్ష నిర్వహించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తులు పూర్తిగా నిషిద్ధమని స్పష్టం చేశారు.

వలంటీర్ల వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదు

● రాజకీయ లబ్ధికోసం జగన్ నాటకాలు : టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బాలాజీ



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బాలాజీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 4 : వలంటీర్ల వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ పేర్కొన్నారు. నగరంలోని 9వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం కుతంత్రాలతో పింఛన్లు ఆలస్యంగా పంపిణీ చేస్తోందని విమర్శించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతినెలా 1వ తేదీనే ఇంటి వద్దకే రూ.4వేలు పింఛన్ అందిస్తామన్నారు.

వీఆర్‌వోపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 4 : తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని బడా రైతుల పేరున అడంగల్ నమోదు చేశారని, ఇందుకు కారకులైన నగరంలోని కనుపర్తిపాడు వీఆర్‌వో గల్లా సుధాకర్‌పై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన దారా సుబ్బమ్మ, నాగూరు శేషయ్య, చెముడుగుంట తిరుపాలు, షేక్ జహరాబీ తదితరులు కోరారు. వారు గురువారం జర్నలిస్టు భవన్‌లో విలేకరులతో తమ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కాటంరెడ్డి రమణారెడ్డి, బుజ్జిరెడ్డిల భూమిని ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ కింద తీసుకుని 1999వ సంవత్సరంలో తమకు ఒక్కొక్కరికి 49 సెంట్లు చొప్పున మంజూరు చేసిందని చెప్పారు. ఈ క్రమంలో తమ పేరును 10/1 అడంగల్‌లో చేర్చమని ఏడాది కాలంగా తిరుగుతున్నా వీఆర్‌వో పట్టించుకోలేదని ఆరోపించారు. పైగా, తమకు ఇచ్చిన ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా వీఆర్‌వో రికార్డులు మార్చి పల్లంరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పేరును అడంగల్‌లో చేర్చి తమకు అన్యాయం చేశారని వాపోయారు. దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. ఉన్నతాధికారులు విచారించి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏలూరు శీనయ్య, నక్కా బాలయ్య, శీనయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


సిద్ధం సభకు మండుటెండలో వెళుతున్న చిన్నారులు

వైసీపీ సభకు బస్సుల తరలింపుతో - తిరుపతి బస్టాండులో ప్రయాణికుల పరిస్థితి





మేమంతా సిద్ధంగా లేం!

- జగన్‌కి తేల్చిచెప్పిన జనం
- వెలవెలబోయిన నాయుడుపేట సభ


గూడూరులో జగన్ అభివాదం

జగన్ మాట్లాడుతుండగానే ఖాళీగా సభా ప్రాంగణం



ప్రచారసభల్లో పదేపదే మీరు సిద్ధమా..అంటూ జగన్ అడుగుతూ ఉంటారు. వెంటనే కెమెరాలు వేదికకు దగ్గరగా ఒకే ప్రాంతం వైపు మళ్లుతాయి.అక్కడ వ్యూహాత్మకంగా ముందే ఏర్పాటు చేసుకున్నవారు చేతులెత్తి అరుస్తారు. ఉమ్మడి జిల్లాలో మదనపల్లె, పూతలపట్టు సభల్లో ఈ డ్రామా పండినా.. నాయుడుపేట సభలో మాత్రం అడ్డం తిరిగింది. జనం లేక సభ వెలవెలపోగా, వచ్చిన జనం కూడా జగన్ మైకు ముందుకు రాగానే జారుకోవడం మొదలుపెట్టారు. మిగిలిన ఆ కాస్తమందీ పేలవంగా స్పందించారు. ఒక రకంగా జగన్ వెంట నడవడానికి తామంతా సిద్ధంగా లేమని జనం ప్రకటించినట్టు అయ్యింది. ఈ పరిస్థితి చూసిన వైసీపీ నాయకులే..'అయ్యో ఇలా అయిపోయిందేమిటా?' అని దిగులు ముఖాలతో కనిపించారు. గురువారం జగన్ బస్సు యాత్రలోనూ ఇదే సీను రిపీట్ అయ్యింది. మరోవైపు జాతీయ రహదారి మొత్తం స్తంభింపజేసి మండుటెండల్లో ప్రజలకు నకరం చూపించారు. ఐదేళ్ల తర్వాత తొలిసారి తమ ముందుకు వచ్చిన జగన్‌రెడ్డి పాత హామీలు గుర్తు చేసుకుని మంచి మాట ఏదైనా చెప్తాడా అని చూసిన వారు నిరాశ చెందారు. అభివృద్ధి ఊసే లేకుండా యధాప్రకారం తిట్ల దండకాలతోనే ఆయన ప్రసంగం ముగియడం విశేషం.

- రేణిగుంట/ఏర్పేడు/నాయుడుపేట/తడ/శ్రీకాళహస్తి/ పెళ్లకూరు/గూడూరు అర్బన్,ఆంధ్రజ్యోతి

81 కిలోమీటర్ల బస్సుయాత్రతో జనానికి నరకం

రేణిగుంట మండలం గురవరాజుపల్లి నుంచి జగన్ గురువారం ఉదయం 10 గంటలకు బయల్దేరి నాయుడు పేటకు సాయంత్రం 5 గంటలకు చేరుకున్నారు. ఈ దూరం 53 కిలోమీటర్లు. అలాగే అక్కడ నుంచీ గూడూరు వద్ద జిల్లా సరిహద్దుల వరకూ 28 కిలోమీటర్లు. మొత్తం ఈ 81 కిలోమీటర్ల దూరం సాగిన బస్సు యాత్ర జిల్లా వ్యాప్తంగా వేలాదిమందికి ప్రత్యక్ష నరకం చూపించింది. రేణిగుంటలో సీఎం జగన్ బస్సు యాత్ర ప్రారంభం కావడానికి గంటా రెండు గంటల ముందే ట్రాఫిక్ ఆపేశారు. చెన్నై, కడప, నెల్లూరు, తిరుపతి కీలక మార్గాల్లో రెండు గంటల పాటు ట్రాఫిక్ ఆపడంతో వేలాది వాహనాలు కిలోమీటర్ల కొద్దీ ఆగిపోయాయి. బస్సు యాత్ర ప్రారంభమైన అరగంట తర్వాత రాకపోకలకు అనుమతించినప్పటికీ ట్రాఫిక్ జామ్ కావడంతో మరో రెండు గంటల పాటు తీవ్ర అవస్థ పడ్డారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి, పెళ్లకూరు మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక విజయవాడ-చెన్నై జాతీయ రహదారిపై వేల కొద్దీ వాహనాలు రెండు వైపులా నిలిచిపోయాయి. ఇలా కనీసం నాలుగైదు గంటల పాటు జాతీయ రహదారిపై వాహనాలు చిక్కుకుపోయాయి. రేణిగుంట మండలం రామకృష్ణాపురం కూడలి వద్ద రెండు అంబులెన్సులు ఇరుక్కుపోయాయి. ఓ వాహనం రోగిని తేవడానికి శ్రీకాళహస్తికి వెళుతుండగా మరోటి రోగిని తిరుపతికి తీసుకెళుతూ గంటల కొద్దీ చిక్కుకుపోయింది. వేసవిలో ఎండ ధాటికి తోడు ఉక్కపోతకు వాహనాల్లోని జనం నరకయాతన అనుభవించారు.

జనమేరి నాయకా?

నాయుడుపేట సభకు జిల్లావ్యాప్తంగా భారీగా జనాన్ని సమీకరించాలని అధికార పార్టీ నేతలు చేసిన ప్రయత్నం విఫలమైంది. గత మంగళవారం నుంచే సిద్ధం సభల కోసం 250 ఆర్టీసీ బస్సులు కేటాయించారు. అవి మదనపల్లె, పూతలపట్టు సభలకు జనాన్ని తరలించే పనిలో బిజీగా నడిచాయి. గురువారం వాటిని నాయుడుపేట సభకు మళ్లించారు. అయితే ఆ బస్సులు సరిపోవని భావించి బుధవారం అర్ధరాత్రి అదనంగా మరో 150 బస్సులు కేటాయించారు. మొత్తం 400 బస్సులు కేటాయించినా సభకు జనం రాలేదు. సభ వేదికపైకి జగన్ చేరుకునే సమయానికి కేవలం ముందువైపు గ్యాలరీల్లో మాత్రమే కార్యకర్తలు వున్నారు. ముప్పావు వంతు గ్యాలరీలు ఖాళీగా కనిపించాయి. జగన్ వేదికపైకి రావడంతో సభ వెలుపల, రోడ్లపై వున్న కార్యకర్తలను, ప్రజలను లోనికి వెళ్లాలంటూ పోలీసులు బతిమాలారు.జగన్ మాట్లాడడం మొదలుపెట్టిన పది నిమిషాల నుంచే ముందు వరుస గ్యాలరీల్లో పలచగా వున్న జనం కూడా బయటకు జారుకోవడం మొదలు పెట్టారు. ఇప్పటి వరకూ జరిగిన జిల్లాస్థాయి మేమంతా సిద్ధం సభల్లో ఇంతగా ఫెయిలైన సభ మరోటి లేదని పార్టీ వర్గాల్లో చర్చ మొదలైంది.

హామీలు మరిచిన జగన్

గత ఎన్నికల్లో జిల్లా ప్రజలకు తానిచ్చిన హామీలను సభలో జగన్ ఏమాత్రం ప్రస్తావించలేదు. 2018లో పాదయాత్రలోనూ, 2019 ఎన్నికల ప్రచారంలోనూ జగన్ జిల్లా ప్రజలకు అనేక హామీలిచ్చారు. గాలేరు-నగరి, ఎస్ఎస్ కెనాల్ ప్రాజెక్టులు పూర్తి చేస్తానని, గాజులమండ్యం చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తానని, మన్నవరం భెల్-ఎన్టీపీసీ ఫ్యాక్టరీ తెరిపిస్తానని, పులికాట్ సరస్సులో పూడిక తొలగిస్తామని... ఎన్నో హామీలు ఇచ్చారు. వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. వాటి గురించి ప్రస్తావించలేదు. స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పులికాట్ పూడిక తీత వంటి సమస్యలు ప్రస్తావించినా జగన్ వినిపించుకోలేదు. దానిపై స్పందించలేదు. దీంతో ఇటు వైసీపీ కార్యకర్తలు, అటు ప్రజలు కూడా తీవ్ర నిరాశకు, అసంతృప్తికి లోనయ్యారు.

శ్రీకాళహస్తి నేతల అత్యుత్సాహం

జనాన్ని ఇబ్బంది పెట్టి మరీ ఇన్నేసి బస్సులను మళ్లించినా నాయుడుపేట సభ ఎందుకు పలచబారిపోయిందా అని ఆరా తీస్తే.. శ్రీకాళహస్తి వైసీపీ నేతలు వాటిలో ఎక్కువ తమ నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లకు జనాన్ని చేరవేయడానికే పరిమితం చేసుకున్నారని తెలిసింది. రేణిగుంట మండలం గురవరాజుపల్లి వద్ద జగన్ రాత్రి బస చేసిన చోటకు 500 మంది మహిళలను బస్సుల్లో ముందే రప్పించి, ఆయన్ను చూడడానికి నిరీక్షిస్తున్నట్టు బిల్డప్ ఇచ్చారు. గంటన్నరకు పైగా అక్కడే పడిగాపులు కాసిన మహిళలకు కనీసం నిలువ నీడ కూడా లేకపోయింది. ఏర్పేడు మండలంలో ఒకటి రెండు చోట్ల మహిళా రైతులు, పెన్షనర్లు అయిన వృద్ధులను కూడా స్థానిక వైసీపీ నేత ఏర్పాటు చేశారు. అక్కడ బస్సు ఆపించి సీఎం జగన్ కిందకు దిగి వారితో మాట్లాడేలా ముందస్తు ఏర్పాటు చేశారు. కాగా జిల్లాలో మొత్తం 1100 ఆర్టీసీ బస్సులుండగా వాటిలో 400 బస్సులు సిద్ధం సభకు కేటాయించారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్లలో బస్సుల కొరత కొట్టొచ్చినట్టు కనిపించింది.

ట్రాఫిక్‌లో ఇరుక్కున్న అంబులెన్స్



కార్యకర్తలున్న చోట్ల ఆగని బస్సు

ఏర్పేడు మండల కేంద్రంలో స్థానిక నేతలు, కార్యకర్తలు రెండు గంటల నుంచీ పడిగాపులు కాశారు. భారీగా స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసుకున్నారు. అయితే బస్సు ఆపకుండా జగన్ లోపలి నుంచీ అభివాదం చేస్తూ ముందుకు వెళ్ళిపోవడంతో వీరంతా తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యారు. పలుచోట్ల కూడా ఇలానే జరిగింది. ముందే నిర్ణయించుకున్న చోట్ల తప్ప మరెక్కడా జగన్ బస్సు ఆగలేదు.

క్రేన్‌కి వేలాడినా..

ఏర్పేడులోనే ఓ కార్యకర్త క్రేన్ సాయంతో భారీ గజమాల వేసేందుకు ఏర్పాటు చేసుకున్నారు. జగన్ బస్సు సమీపించగానే క్రేన్ కొక్కీ వద్ద ఆ కార్యకర్త గాల్లో వేలాడుతూ మాల వేసేందుకు సంసిద్ధమయ్యాడు. అయితే బస్సు ఆపినా జగన్ మాత్రం కిందకు దిగలేదు. దీంతో క్రేన్ సాయంతో ఆ కార్యకర్త గజమాలను బస్సు పైభాగంలో తాకించి సంతృప్తి పడాల్సి వచ్చింది. ఇంత ప్రమాదకర ఫీట్ చేసిన ఆ కార్యకర్తను వైసీపీ నేతలు గానీ పోలీసులు గానీ వారించకపోవడం విమర్శలకు దారి తీసింది.

డ్రైవర్లు తక్కువ.... యజమానులే ఎక్కువ

బస్సు యాత్రలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం పొయ్య గ్రామం వద్ద సీఎం జగన్ లారీ, ఆటో డ్రైవర్లతో ముఖాముఖీ సమావేశమయ్యారు. ఈ సమావేశం డ్రైవర్ల పేరిట జరిపినా నిజానికి హాజరైన వారిలో లారీ, ఆటో డ్రైవర్లు చాలా తక్కువ. వాటి యజమానులే ఎక్కువగా కనిపించారు. సమావేశంలోకి జగన్ రాకముందే ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ పాత్రికేయులను స్థానిక నేతల ద్వారా గుర్తించి బయటకు పంపించేశారు. సమావేశం పేరుకు ముఖాముఖీ అయినా వారితో ముఖాముఖీ మాట్లాడిందేమీ లేదు. వారి చేతికి మైక్ ఇవ్వడంతో ఎక్కువమంది జగన్‌ను పొగిడేందుకే సమయం వెచ్చించారు. ఒకరిద్దరు సమ్యలు ప్రస్తావించినా జగన్ వాటిని వినిపించుకోనట్టుగా మిన్నకుండిపోయారు తప్పితే స్పందించలేదు. ఓ ఆటో డ్రైవర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్కూలు పిల్లలకు ఏటా ఉచితంగా యూనిఫామ్ ఇస్తున్న విధంగా తమకు కూడా ఏడాదికి రెండు జతలు యూనిఫామ్ అందజేయాలని కోరగా ఆ మాటలను జగన్ వినిపించుకోనట్టుగా వుండిపోయారు. సూచనల పెట్టెలు రెండు ఏర్పాటు చేశామని, ఎవరైనా సలహాలు, సూచనలు చేయదలిస్తే స్లిప్పులో రాసి ఆ పెట్టెల్లో వేస్తే తాను తర్వాత పరిశీలిస్తానంటూ చెప్పి నిష్క్రమించారు.


సిద్ధం సభకు వెళుతున్న చిట్టమూరు మండలం తాడిమేడు అంగన్‌వాడీ ఆయా

31మంది వలంటీర్ల రాజీనామా

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 4: మరో 31మంది వలంటీర్లు రాజీనామా బాటపట్టారు.వైసీపీ నేతల ఒత్తిళ్లతో చాలామంది వలంటీర్లు రాజీనామాలు చేసి వైసీపీ ప్రచారంలో పాల్గొంటున్న విషయం తెలిసిందే.జిల్లావ్యాప్తంగా గురువారం నాటికి 67 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు సమాచారం.వీరిలో గురువారమే కోట మండలంలో 24 మంది,ఏర్పేడులో ఐదుగురు,పుత్తూరు ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేశారు.ఈ క్రమంలో ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు, ఇతర డివైజర్లతో పాటు వారి పరిధిలో 50 కుటుంబాల సమగ్ర సమాచారాన్ని, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ పుస్తకాలను అధికారులకు తిరిగివ్వాల్సివుంది. అయితే వాటిని వెనక్కు ఇవ్వడంలేదన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

వైసీపీ విషప్రచారాలతో

కొనసాగిన పింఛను కష్టాలు

- సచివాలయాల వద్ద పండుటాకుల పడిగాపులు


రేణిగుంటలో అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలికి ఆటోలోనే పింఛను అందజేసేందుకు వలంటీరు యత్నం

తిరుపతి (కలెక్టరేట్), ఏప్రిల్ 4:మండే ఎండలు ఒక వైపు.. సచివాలయాలకు వెళ్లకపోతే పింఛను రాదేమోనన్న వైసీపీ విష ప్రచారాలతో భయం మరోవైపు...వెరసి కళ్లు సరిగా కనిపించకపోయినా, నడవడానికి కాళ్లు సహకరించకపోయినా వృద్ధులు సచివాలయాల వద్ద రెండవ రోజైన గురువారం కూడా పడిగాపులు కాశారు.పింఛన్లకు వలంటీర్లను దూరం చేస్తూ ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని తమకు అనుకూలంగా మలచుకునేందుకు వైసీపీ కుటిలయత్నం చేస్తోంది. టీడీపీ వల్లనే ఈ కష్టాలంటూ నమ్మించేందుకు పండుటాకులను ఇబ్బంది పెడుతోంది. 'పింఛను కోసం ఇప్పుడే వచ్చేయండి. శుక్రవారమే ఆఖరు. ఆ తర్వాత ఇవ్వరు. ఇప్పుడొచ్చి తీసుకోకుంటే ఈ నెల పింఛను పోయినట్లే' అంటూ పెన్షన్‌దారుల జాబితా పక్కనపెట్టుకుని కొందరు వలంటీర్లు, నేతల ద్వారా ఫోన్లు చేయిస్తున్నారు. దీంతో ఎక్కడ తమకు పింఛను రాకుండా పోతుందోనన్న ఆందోళనతో గురువారం ఉదయాన్నే అందరూ ఒక్కసారిగా సచివాలయాలకు చేరుకున్నారు. దివ్యాంగులకు, అనారోగ్యంతో మంచంపట్టినవారికి, వీల్‌ఛైర్‌లో ఉన్నవారికి ఇళ్ల వద్దకే వచ్చి పింఛను అందజేయాలని ఆదేశాలున్నా అటు పంచాయతీ, ఇటు సచివాలయ ఉద్యోగులు రాకపోవడంతో మండుటెండలో లబ్ధిదారులు సచివాలయాల వద్దకు కుటుంబీకుల సాయంతో వచ్చి నిరీక్షించారు.అయితే ఉదయం11గంటల తరువాతే పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. పింఛనుదారులకు సరిపోయే సొమ్ము లేకపోవడంతో సచివాలయ సిబ్బంది కూడా బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది.గురువారం 2,38,000 మందికి పింఛన్లు అందజేసినట్లు డీఆర్డీఏ అధికారులు వెల్లడించారు.


వరదయ్యపాళెం మండలం పెద్దపాండూరు సచివాలయం వద్ద ఉదయం నుంచే పింఛను కోసం వేచివున్న వృద్ధులు

పిల్లలు,మహిళలపై

వైసీపీ కార్యకర్తల దాడి

ఓజిలి, ఏప్రిల్ 4 : ఓజిలి మండలం రాచపాళెం వద్ద గురువారం గ్రామానికి చెందిన అరుంధతీయులపై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం హేయమని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. చిన్నపిల్లలు, మహిళలు అని కూడా చూడకుండా దాడి చేసిన వారిని పోలీసులు వెనకేసుకు రావడాన్ని ఖండించారు. దళితులపై వైసీపీ చేయిస్తున్న దాడులకు ఈ చర్యలు పరాకాష్ట అన్నారు. ఈ సంఘటనపై బాధితులు తెలిపిన వివరాల మేరకు.. జయంపు నుంచి సిద్ధం సభకు వైసీపీ కార్యకర్తలు వెళుతున్న బస్సు ఒకటి రాచపాళెం వద్దకొచ్చేసరికి ఓ గోతిలో దిగింది. దీంతో బస్సు అద్దం చిట్లింది. ఆ సమయంలో రోడ్డు పక్కన ఆడుకుంటున్న చిన్న పిల్లలు బస్సుపై రాళ్లతో దాడి చేశారంటూ.. వైసీపీ కార్యకర్తలు వాహనం దిగొచ్చి వారిని కొట్టారు. సమీపంలోని పిల్లల తల్లులు దీన్ని గమనించి ఎందుకు కొట్టారంటూ.. నిలదీయడంతో వారిని కూడా దుర్భాషలాడుతూ, అవమానించారు. దీంతో వైసీపీ కార్యకర్తలు క్షమాపణ చెప్పి వెళ్లాల్సిందేనని, అక్కడి అరుంధతీయులంతా కలిసి బస్సును అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఓజిలి ఎస్ఐ రవిబాబు సంఘటన స్థలానికి చేరుకుని సర్దుబాటు చేసి, బస్సును పంపేశారు. అయితే వైసీపీ కార్యకర్తలపై ఎలాంటి కేసు నమోదు చేయక పోవడంతో సాయంత్రం రాచపాళెం అరుంధతీయులు మహిళలు, పురుషులు సుమారుగా 70 మంది పోలీసు స్టేషనుకు వెళ్లారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

కొత్త కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 4: తిరుపతి జిల్లా కలెక్టర్‌గా 2006వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్‌హెచ్ ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు.ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఏపీఐఐసీ) వైస్ చైర్మన్, ఎండీగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ గతంలో విశాఖపట్టణం, ప్రకాశం జిల్లాల కలెక్టర్‌గా పనిచేశారు. ఇక్కడ పనిచేస్తుండిన కలెక్టర్ లక్ష్మీశను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెండు రోజుల కిందట ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే.

మము కాపాడు ముత్యాలమ్మా..!



చిల్లకూరు, ఏప్రిల్ 4: మము కాపాడు ముత్యాలమ్మా.. అంటూ భక్తుల ప్రార్థలను మిన్నంటాయి. చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరకు గురువారం రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాలనుంచి భక్తులు తరలి వచ్చారు. అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. గురునాథస్వామి, అంకమ్మలకు గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

గురునాథస్వామి, అంకమ్మల గ్రామోత్సవం

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్రవారం) : సా. 6.28
సహరి (శనివారం) : ఉ. 4.46

జగన్‌రెడ్డి పాలనలో ప్రజలకన్నీ కష్టాలే..!

బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు


సమావేశంలో పాల్గొన్న బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 4 : సీఎం జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు అష్టకష్టాలు పడ్డారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తాడిపర్తి ఆదినారాయణ, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీరెడ్డి మండిపడ్డారు. నాయుడుపేటలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో కూటమి సమావేశంలో వారు మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలో ఏడుసార్లు కరెంట్ చార్జీలు పెంచారని, పేదల కడుపునింపే అన్న క్యాంటీన్లను మూసివేశారన్నారు. గంజాయి, డ్రగ్స్‌లో రాష్ట్రాన్ని ప్రథమస్థానంలోకి నిలిపారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు అవధానం సుధీర్, రంగినేని కృష్ణయ్య, జంపాల మాల్యాద్రినాయుడు, విజయభాస్కర్, తన్నీరు శేషగిరిరావు, గిరిబాబు, పేరం రమేష్‌నాయుడు, నెలవల రాజేష్, జనసేన గిండి సతీష్, యశ్వంత్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పెంచాలి

కోట, ఏప్రిల్ 4: ఉపాధి హామీ పథకం పనుల్లో నాణ్యత పెంచాలని జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్లు రమణ, ఖలీల్ కోరారు. తిమ్మానాయుడుపాళెం, వెంకన్నపాళెం గ్రామాల్లో జరిగిన పనులను గురువారం ఆయా అధికారులతోపాటు డ్వామా ఏపీడీ డాక్టర్ వరప్రసాద్ తనిఖీ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్, శాంతి, చంద్రశేఖర్, పరుశురాంతదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు

కోట, ఏప్రిల్ 4: కొత్తపాళెంలోని ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. పలు రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలిచ్చారు. అనంతరం కొత్తపాళెంలోని నాడు-నేడు నిధులతో జరుగుతున్న ఉన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. హెచ్‌ఎం పద్మావతి తదితరులున్నారు.

స్వర్గధామం గ్యాలరీ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం


చెక్కును అందజేస్తున్న దాతలు

కోట, ఏప్రిల్ 4 : కోట పట్టణ పొలిమేరల్లో ఏర్పాటు చేసి ఉన్న హిందూ శ్మశానవాటిక స్వర్గ ధామంలో గ్యాలరీ ఏర్పాటుకు పసుపులేటి చారిటబుల్ ట్రస్టు గురువారం రూ.2 లక్షలను విరాళమిచ్చింది. ట్రస్టు చైర్మన్ సంపూర్ణమ్మ తన భర్త మనోహర్ వర్థంతిని పురస్కరించుకుని ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును స్వర్గధామం ప్రతినిధి జెన్ని ప్రసాద్‌కు తన మనవడు నిహార్ మనోహర్ ద్వారా అందజేశారు. ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్, డాక్టర్ దివ్యప్రియ దంపతులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


సుజీవనమ్మ

దక్కిలి, ఏప్రిల్ 4:ఎస్వీ యూనివర్సిటీలోని హోంసైన్స్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి దక్కిలి మండలం ఆల్తూరుపాడుకు చెందిన కె.సుజీవనమ్మకు డాక్టరేట్ ప్రదానం చేశారు. గృహవిజ్ఞానశాస్త్ర సీనియర్ ఆచార్యులు కె.అనురాధ పర్యవేక్షణలో క్వాలిటీ ఆఫ్ ఈసీఈ ప్రోగ్రామ్స్ ఇన్ డిఫరెంటు సెక్టార్స్ ఇన్ రిలేషన్ టూ ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్స్ కాంపిటెన్సీస్ ఇన్ బెంగళూరు, మైసూర్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినట్లు పరీక్షల నియంత్రణ అధికారి దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీలోకి మాజీ సర్పంచ్ చేరిక

వాకాడు, ఏప్రిల్ 4 : వల్లమేడు మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు వాకాటి సంపత్‌కుమార్ గురువారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఆధ్వర్యంలో గూడూరులో జరిగిన ఆత్మీయ సమావేశంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు, గూడూరు కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

గూడూరు/చిల్లకూరు, ఏప్రిల్ 4: రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. గూడూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోటుపాళెం గ్రామానికి చెందిన ఏడుకొండలు(30).. వెల్డింగ్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గురువారం పని నిమిత్తం గ్రామం నుంచి నడుచుకుంటూ గూడూరుకు వస్తున్నాడు. జాతీయ రహదారిపై కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి ఆయన్ను ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ●చిల్లకూరు మండలంలోని పారిచెర్లవారిపాళెంకు చెందిన మురళి(45) గ్రామం నుంచి బైక్‌పై గూడూరు వైపు గురువారం రాత్రి బయల్దేరాడు. గ్రామ సమీపంలోనే ఎదురుగా వస్తున్న మరోబైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మోటర్ సైకిళ్లను ఢీకొట్టిన కారు

బాలాయపల్లి, ఏప్రిల్ 4: మోటర్ సైకిళ్లను ఓ కారు ఢీకొట్టింది. ఈ సంఘటన మండలంలోని జయంపు గ్రామంలో గురువారం జరిగింది. స్థానిక అంబేడ్కర్ విగ్రహం పార్కింగ్ చేసి ఉన్న మోటర్ సైకిళ్లను ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. స్థానికులు గమనించి కారును ఆపగా, అందులోని వారు మద్యం మత్తులో ఉన్నారు. వీరిని వాహనంతోపాటు పోలీసులకు స్థానికులు అప్పగించారు. ఈ సంఘటనలో ఎవరూ గాయపడలేదు.

12 మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట, ఏప్రిల్ 4: కోట పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డు వద్ద గురువారం 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు. కోట దళితవాడకు చెందిన దాసరి సుకుమార్, ఇంగిలాల కోటయ్యలు మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా.. కాపుకాచి పట్టుకుని, వారిద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుంచి ఓ ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

ఎంపీడీవోకు గ్రామస్తులు, టీడీపీ నేతల ఫిర్యాదు


బస్సులో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు

కోట, ఏప్రిల్ 4: నెల్లూరుపల్లి కొత్తపాళెం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబుపై చర్యలు తీసుకోవాలంటూ ఎంపీడీవో శంకరయ్యకు గురువారం గ్రామస్తులు, టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా నాయుడుపేటలో జరిగే సిద్ధం సభకు వైసీపీ తరఫున రాంబాబు జన సమీకరణ చేశారని, పైగా తానుకూడా వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి బస్సులో సభకు వెళ్లారని చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటోలు కూడా ఉన్నాయని, ఆయన్ను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆ వినతిపత్రంలో కోరారు.

23మంది వలంటీర్ల రాజీనామా

కోట, ఏప్రిల్ 4 : కోట పట్టణంలోని సచివాలయం 1, 2, 3ల నుంచి గురువారం 23మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో శంకరయ్యకు అందజేశారు. తొలుత 24 మంది రాజీనామా చేశారు. వీరిలో శ్యామసుందరపురానికి చెందిన ఓ మహిళా వలంటీర్ మాత్రం తన తప్పు తెలుసుకున్నానని, రాజీనామా ఆమోదించవద్దని ప్రాధేయపడ్డారు. దీంతో ఆమె రాజీనామా పత్రాన్ని వెనక్కిచ్చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

తూర్పు కనుపూరు.. జనసంద్రం

ముత్యాలమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు




ఆలయం వద్ద భక్తులు - గ్రామోత్సవంలో నాట్యం చేస్తున్న గణాచారి - పోలేరమ్మకు హారతి


పుష్పాలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు, ఏప్రిల్ 4: ముత్యాలమ్మ జాతరకు మూడో రోజైన గురువారం భక్తులు పోటెత్తారు. తూర్పుకనుపూరు, కోట, సిద్దవరం, మార్గాల్లో సుమారు కిలోమీటరు మేర ట్రాఫిక్ స్తంభించింది. ఒక దశలో తూర్పుకనుపూరు జనసంద్రంలా కనిపించింది. భక్తులు వేయికండ్ల కుండలను నెత్తిన పెట్టుకుని గుడిపైకి కోడి పిల్లలు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ముత్యాలమ్మతోపాటు గంగమిట్ట మీద ఉంచిన పోలేరమ్మకు కూడా పొంగళ్లు సమర్పించారు. గురునాథస్వామి, అంకమ్మలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు నృత్యాలు చేశారు. అనంతరం గంగమిట్ట సమీపంలో రెండు తాటిచెట్ల మధ్య వేసిన ఉయ్యాలలో పోలిశెట్టి, గణాచారులు అమ్మణ్ణికి ఉయ్యాల సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో నవీన్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి బందోబస్తు నిర్వహించారు. ఇక భక్తులు ఎండ వేడిమికి తట్టుకోలేక తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నివాసాల్లో, చెట్ల కింద సేద తీరారు. పలు కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లు, అంబళ్లు సరఫరా చేశారు. అంతేకాకుండా ఆలయ సిబ్బంది జాతరకు వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.


వేయికండ్ల కుండలతో భక్తులు

అమ్మవారికి పూలంగిసేవ

ముత్యాలమ్మ అమ్మవారికి గురువారం పూలంగిసేవ నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు.

నేటితో ముగియనున్న జాతర

గంగమిట్ట మీద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పోలేరమ్మ అమ్మవారిని నాల్గవ రోజు శుక్రవారం ఉదయం ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్లనంపుతారు. ఈ కార్యక్రమంతో జాతర ముగుస్తుంది.

'సిద్ధం' సభలకు ఆర్టీసీ బస్సులు

తీవ్ర ఇబ్బందిపడ్డ ముత్యాలమ్మ భక్తులు, ప్రయాణికులు



జాతరకు వెళ్లేందుకు గూడూరులో బస్సు వద్ద రద్దీ - నాయుడుపేట ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

గూడూరు, ఏప్రిల్ 4: పూతలపట్టు, నాయుడుపేట ప్రాంతాల్లో నిర్వహించిన ' మేమంతా సిద్ధం' సభలకు గూడూరు డిపో నుంచి 10 బస్సులను తరలించారు. దీంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ జాతరకు వెళ్లేందుకు బస్సుల కొరత ఏర్పడి.. భక్తులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. జాతరకు ప్రతి ఏడాది గూడూరు పాత బస్టాండు నుంచి ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడుపుతుంది. గత ఏడాది జాతరకు రెండ్రోజులపాటు గూడూరు డిపోకు చెందినవి 20, ఇతర డిపోలకు చెందినవి 20 కలిపి మొత్తం 40 బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. వీటివల్ల సుమారు రూ.10 లక్షల వరకు కలెక్షన్ వచ్చినట్లు అంచనా. ఈ ఏడాది బుధవారం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయలేదు. గూడూరు డిపోలో మొత్తం 45 బస్సులుండగా బుధవారం 10 వాహనాలను సిద్ధం సభకు తరలించారు. గురువారం కూడా 10 బస్సులను పంపారు.ఈ క్రమంలో గురువారం మాత్రం 10 బస్సులను మాత్రమే ఏర్పాటు చేశారు. ఇవి చాలక పోవడంతో భక్తులు తీవ్ర అవస్థ పడ్డారు. ఇంకొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తే వారు అధిక చార్జీలు వసూలు చేశారని జనం ఆవేదన వ్యక్తం చేశారు. జాతర సమయంలో కూడా సిద్ధం సభలకు బస్సులను పంపడంపై భక్తుల నుంచి విమర్శలొచ్చాయి.

బస్టాండుల్లో ప్రయాణికుల నిరీక్షణ

నాయుడుపేట: సిద్ధం సభలకు ఆర్టీసీ బస్సులు తరలించడంతో సూళ్లూరుపేట, నాయుడుపేట బస్టాండుల్లో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మరోవైపు తూర్పు కనుపూరులో ముత్యాలమ్మ జాతరకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయలేదు. జాతరకు వెళ్లేవారూ అవస్థ పడ్డారు. ఆటోలను ఆశ్రయిస్తే, వారు అధిక చార్జీలు వసూలు చేశారని ప్రయాణికులు వాపోయారు.

వెంకటగిరిలో ఇలా..

వెంకటగిరి టౌన్: సిద్ధం సభకు వెంకటగిరి డిపో నుంచి ఎనిమిది బస్సులు తరలించారు. దీంతో ఇక్కడా ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి: పాశం


టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 4: రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న రాక్షసపాలనకు రానున్న ఎన్నికలలో చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పగడాలపల్లి గ్రామంలో పలువురు టీడీపీలోకి చేరడంతో వారికి పార్టీకండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం దోచుకోవడమే ధ్యేయంగా పాలన సాగించిందని మండిపడ్డారు. అవినీతిని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించి, దౌర్జన్యాలకు దిగారన్నారు. రామరాజ్యం రావాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. నంభూరు వెంకటేశ్వర్లునాయుడు, పుట్టి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, పెంచలరెడ్డి, శ్రీహరినాయుడు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదు

గూడూరు అర్బన్: వలంటీర్ల వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదని పాశం సునీల్‌కుమార్ అన్నారు. రాజకీయాలు చేసే వలంటీర్లకు మాత్రమే టీడీపీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. వలంటీర్లను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. ఇక ప్రతిపక్షాలను దూషించేందుకే పింఛన్ల పంపిణీకి అడ్డంకులను వైసీపీ సృష్టింస్తోందని, కోడికత్తి డ్రామాలను ఇక ప్రజలు నమ్మరని పేర్కొన్నారు.

వైసీపీ తప్పులను చంద్రబాబుపై నెట్టడం దారుణం

● వెంకటగిరి టీడీపీ అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ


వెంకటగిరిలో వృద్ధుడితో మాట్లాడుతున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, ఏప్రిల్ 4: వైసీపీ ప్రభుత్వం చేసే తప్పులను టీడీపీ అధినేత చంద్రబాబుపై నెట్టడం దారుణమని వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని 21వ వార్డు, రూరల్ పరిధిలోని మన్నూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పింఛన్ల పంపిణీ విషయంలో వైసీపీ నాయకులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎన్నికల్లో వైసీపీకి ఎలా బుద్ధి చెప్పాల్లో ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చేశారని తెలిపారు. టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథనాయుడు, శివ, శ్రీరామదాస్ గంగాధర్, అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, గల్లా శ్రీనివాసులు, సుధ తదితరులున్నారు.

రాజకీయాన్ని వ్యాపారం చేసిన జగన్

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాజకీయాన్ని వ్యాపారం చేసేశారని టీడీపీ అభ్యర్థి లక్ష్మీసాయి ప్రియ విమర్శించారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. 'జగన్ సీఎం అయ్యాక లక్ష కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నాడని జనం అనుకుంటుంటే విన్నాను. అంత డబ్బు ఏం చేసుకుంటావు జగన్' అని ప్రశ్నించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, వెంకటగిరి బీజేపీ ఇన్‌చార్జి ఎస్‌ఎస్‌ఆర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

బాలాయపల్లి: 'నన్ను గెలిపించండి అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా' అని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీ సాయి ప్రియ అన్నారు. బాలాయపల్లి మండలంలోని మన్నూరులో గురువారం జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. అనంతరం వైసీపీకి చెందిన గ్రామ ఉప సర్పంచ్ వీరపు మోహన్‌తోపాటు పర్సారు సుధాకర్, వెంకటయ్య, పెదపోలయ్య, సుబ్బరామయ్య, వెందోడి చిరంజీవి తదితరులకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యం నాయుడు,కూను శ్రీహరి, సీసీ నాయుడు, సీవీకే నాయుడు, కొర్రపాటి రామచంద్రనాయుడు, జడపల్లి కోటేశ్వరావు, బాబురెడ్డి, వల్లెపు ఈశ్వర్, గుండుబోయిన గోపాల్ యాదవ్, మద్దూరు కృష్ణ, దాసరి కోటేశ్వరరావు, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పాపం జగన్‌దే : నెలవల విజయశ్రీ


వృద్ధురాలితో మాట్లాడుతున్న పరసా, అభివాదం చేస్తున్న విజయశ్రీ

తడ, ఏప్రిల్ 4: 'పింఛన్ల సొమ్మును సకాలంలో బ్యాంకులకు జమ చేయకుండా వృద్ధులను వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసింది. ఈ పాపం జగన్‌దే' అని టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ విమర్శించారు. గురువారం సాయంత్రం తడలో టీడీపీ ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. 32 మంది వృద్ధుల ప్రాణాలు కోల్పోవడానికి జగనే కారణమన్నారు. మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ.. పేద ప్రజల ఉసురు ఈ ప్రభుత్వానికి తగులుతుందని చెప్పారు. పార్టీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, నాయకులు బొమ్మన పళణి, నీలకంఠం, శివ, శివాజీ, జయపాల్, శ్యామ్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాగానే 4వేల పింఛను ఇంటికే

దొరవారిసత్రం: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4వేల పింఛను డబ్బులు ఇంటి వద్దకే వస్తాయని మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం అన్నారు. దొరవారిసత్రం మండలం వేణుంబాకలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ, మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు, 786 రఫీ, టీడీపీ నేతలతో కలసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి పల్లంపర్తి మనోహర్‌రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు గోను జక్కరయ్య, మొండెం బాబు, ప్రసాద్‌నాయుడు, గోపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, ఉదయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలి: టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 4: సచివాలయ సిబ్బంది పింఛన్లను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీని టీడీపీ నాయకులు పరిశీలించి, స్థానిక టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయకుండా.. టీడీపీపై నిందలు వేసేలా, పరోక్షంగా వైసీపీకి అనుకూలంగా ఉండేలా వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. వైసీపీ కుట్రలను పింఛనుదారులు నమ్మవద్దన్నారు. అబ్దుల్ రహీమ్, ఇశ్రాయిల్ కుమార్, వెంకటేష్, వెంకటేశ్వర్లురెడ్డి, పార్వతయ్య, సునీల్, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 61,087 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,530 మంది తలనీలాలు సమర్పించారు.

ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

టీటీడీ ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళం అందింది. భువనేశ్వర్‌కు చెందిన బల్భద్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ విరాళాన్ని అందజేసింది. ఆ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర విరాళం డీడీని తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


రుక్సార్ ధిల్లాన్

తిరుమల, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, సినీ హీరోయిన్ రుక్సార్ ధిల్లాన్ ఉన్నారు.

జేఈఈ మెయిన్స్ రెండో దశ పరీక్షలు ప్రారంభం

తిరుపతి(విద్య), ఏప్రిల్4: జాతీయ స్థాయిలో ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐటీలలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే జేఈఈ మెయిన్స్ రెండో దశ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో తిరుపతి కేంద్రంగా జూపార్క్ రోడ్డులోని అయాన్ డిజిటల్ జోన్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు తొలిరోజు 1,412మంది విద్యార్థులకు గాను 1,249మంది హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ టిక్రైలాల్ ఎనాథ్ పేర్కొన్నారు. 163మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

పీవో, ఏపీవోలకు శిక్షణ ఇవ్వండి

ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 4: పోలింగ్ విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవోలకు నియోజకవర్గ స్థాయిలో శిక్షణ ఇవ్వాలని సంబంధిత అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్(జేసీ) ధ్యానచంద్ర ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులకు నామినేషన్ ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18న ఎన్నికల నోటిఫికేషన్ రాన్ను నేపథ్యంలో ప్రతి విషయాన్నీ అవగాహన చేసుకోవాలన్నారు. పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని ప్రలోభపెట్టే కానుకలను నియంత్రించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, ఈఆర్వోలు ఆదితిసింగ్, కిరణ్‌కుమార్, నిషాంత్‌రెడ్డి, ఎన్నికల విధుల్లో ఉన్న రుద్రరాజు, చెన్నయ్య, గీతారాణి పాల్గొన్నారు.

ఘనంగా మెట్లోత్సవం



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 4: అన్నమయ్య 521వ వర్థంతిని పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో గురువారం వేకువజామున అలిపిరిలో మెట్లోత్సవం నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి వచ్చిన 2వేల మంది భజనమండళ్లకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ప్రముఖ కళాకారులు భజనలతో భగవన్నామము పాడుతూ ఉండగా, వీరు మెట్ల మార్గం ద్వారా తిరుమల చేరుకున్నారు. తొలుత అన్నమయ్య వంశీకులు అలిపిరిలో మెట్లపూజ నిర్వహించి, సంకీర్తనాగానంతో పూజ ప్రారంభించారు. అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టరు ఆకెళ్ల విభీషణ శర్మ, గోవిందరాజస్వామి ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, అన్నమాచార్య వంశీకులు తాళ్లపాక హరినారాయణాచార్యులు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు పాల్గొన్నారు.

బిల్లుల్లేని రూ.24.74 లక్షల సీజ్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 4 : బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.24.74 లక్షలను తిరుపతిలో గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది సీజ్ చేశారు. సీఐ జయనాయక్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. చిన్న బజారు వీధిలో బంగారు షాపు నిర్వహిస్తున్న మోహన్‌రెడ్డి తీసుకెళుతున్న రూ.24.74 లక్షలు సీజ్ చేశారు. నగదును ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లు సీఐ చెప్పారు.

ఎల్‌ఎల్‌ఎం నాలుగో సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 4: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన ఎల్‌ఎల్‌ఎం నాల్గవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపరిచినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

రేపు అయోధ్యకాండ అఖండపారాయణం

తిరుమల, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై శనివారం తొమ్మిదవ విడత అయోధ్యకాండ పారాయణం నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. అయోధ్యకాండలోని 31 నుంచి 34 సర్గ వరకు మొత్తం నాలుగు సర్గల్లో 172 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 197 శ్లోకాలను పారాయణం చేస్తారు.